విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729


# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :83 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 13 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతా

- ప్రతిపక్షమే సభను అడ్డుకుంటోంది
- విపక్షాల ఆందోళనలపై స్పందించిన అమిత్ షా
- పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమే అంటూ వెల్లడి

## 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ
# ఆమోదం



- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులు
- ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు
- గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు విస్తరించాలని సీఎం ఆదేశం
- అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్లు

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ.2,08,406 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించనున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలను విస్తరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్

వివరాలు 2లో..



## ప్రజా సమస్యలపై
# పోరాడతాం

- వైఎస్ జగన్ వ్యూహంతో వైఎస్సార్‌సీపీ
- డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం
- డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు
- అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే
- ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం

**తాడేపల్లి**

ప్రజా సమస్యలపై చట్టసభలో గళం విప్పాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్టసభ్యులకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో

వివరాలు 2లో..



## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- 13 మందిపై 20వేల పేజీలతో ఢిల్లీ కోర్టులో సీబీఐ ఛార్జ్‌షీట్
- ఛార్జిషీటులో ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమన్న కోర్టు
- బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచిన


## జమిలి ఎన్నికలపై కోవింద్ కృషి

- 'జమిలి ఎన్నికలపై కోవింద్ గొప్ప సూచనలు చేశారు'
- మాజీ రాష్ట్రపతి బయోగ్రఫీని ఆవిష్కరించిన మోదీ
- రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథను ఆవిష్కరించిన ప్రధాని మోదీ
- యువత రీల్స్, సోషల్ మీడియా కంటెంట్‌కే పరిమితం కావొద్దన్న మోదీ
- నచ్చిన వారి జీవిత చరిత్రలను చదవాలని సూచన



## స్థానిక సంస్థల ఎన్నికలకు
# సమాయుత్తం


- సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రకటన
- సెప్టెంబర్ మూడో తేదీన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీలలో ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్ ప్రకటన
- ఈ మేరకు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల సంఘం




**అమరావతి**

ఏపీలో సెప్టెంబర్ 3న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయితీల్లో ఫొటో ఎలక్ట్రోరల్ రోల్స్‌ను ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా సన్నద్ధంగా ఉండాలని ఆయా ఉన్నతాధికార్లను, జిల్లాల యంత్రాంగాలను ఎన్నికల సంఘం సమాయుత్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖల కార్యదర్శుల స్థాయిలో ఒక విడత సమావేశం జరిగింది. ఆ తర్వాత పలు సమావేశాలను నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తూ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఎన్నికల ప్రక్రియను ఎప్పుడు

వివరాలు 2లో..



## నిరసనలు, నినాదాలతో సభ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు

- విపక్షాలకు ఓం బిర్లా హితవు
- ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచన
- సభను సజావుగా నడిచేందుకు సహకరించాలని విజ్ఞప్తి

## మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు
# పటిష్ట చర్యలు



- సైబర్ క్రైం, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి
- సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాన్ని కట్టడి చేయాలి
- రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

**అమరావతి**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీస్ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. సైబర్ క్రైమ్, బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసులను ఆదేశించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఫేక్ ప్రచారాన్ని కట్టడి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. డీజీపీ నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,650 మంది పోలీసు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. అలాగే రేంజ్ ఐజీలు, డీఐజీలు, జిల్లాల ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు వర్చువల్‌గా

వివరాలు 2లో..

## 'ప్రహార్' వ్యూహం దశలవారీ అమలు

- ఉగ్రవాద కార్యకలాపాలు, తీవ్రవాదాన్ని నిరోధించడానికి, ఎదుర్కోవడానికి ఈ వ్యూహం
- రాజ్యసభలో కొందరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం



# 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

డేటా సెంటర్ రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ.58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ.31,387 కోట్ల కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నింటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర ఎకోసిస్టమ్‌కు పరిశ్రమలు జోడిస్తున్న విలువను విశ్లేషించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### డిసెంబరులోగా పూర్తి చేయాలి

రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికి గర్వకారణమని సీఎం స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం సమీపంలో ఏరోస్పేస్ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. లాజిస్టిక్స్, ఆధునిక వేర్‌హౌసింగ్, కోల్డ్‌చైన్ ప్రాజెక్టులను సమన్వయం చేయాలని సూచించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా రోడ్, రైలు, పోర్టు కనెక్టివిటీని అభివృద్ధి చేయాలన్నారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలని సీఎం



ఆదేశించారు. సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో 175 నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 363 ప్రతిపాదనలకు రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదం పొందగా, 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

### భారీగా పెట్టుబడులు

20వ ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పరిశీలిస్తే, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తిరుపతి, నెల్లూరు సహా పలు జిల్లాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయి. ముఖ్యంగా అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్‌కు రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ.58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ.31,387 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు ఉన్నాయి. కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15 వేల కోట్లు, కర్నూలులో అగస్త్యా గ్రీన్ ఎనర్జీ రూ.7,799 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయి. కడప కొప్పర్తి క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ రూ.450 కోట్ల పెట్టుబడితో ఏకంగా 7 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. నెల్లూరు మనుబోలులో వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.500 కోట్లతో 2 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.330 కోట్లకుపైగా పెట్టుబడితో 1,110 మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. మునోథ్ లిథియం బ్యాటరీ, గ్రీన్ ఎనర్జీ, బయోగ్యాస్, డేటా సెంటర్లు, హోటల్స్, లాజిస్టిక్స్, ఆగ్రో, మైనింగ్ రంగాల్లోనూ పలు ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా ఈ 25 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెట్టుబడులతో పాటు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

# ఏపీలో కుటుంబ రాజకీయాలు..సమీకరణలు!

**విజయవాడ :** వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి కోరుకుంది ఆ ఫ్యామిలీ. అందుకు పార్టీ హై కమాండ్ అంగీకరించకపోవడంతో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కేసుల రూపంలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది.. ఆ ఫ్యామిలీ మద్దతుతోనే పార్టీని ఏర్పాటు చేశారు. తొలి ఎన్నికల్లో అధికార పార్టీకి ధీటుగా సీట్లు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తల్లి విజయలక్ష్మి, చెల్లెలు షర్మిల, బాబాయ్ వివేకానంద రెడ్డి, సోదరులు అవినాష్ రెడ్డి, మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి.. ఇలా చెప్పుకుంటే ఆ ఫ్యామిలీ మొత్తం జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడింది. అయితే అదే సమయంలో టిడిపిలో చూస్తే మాత్రం చంద్రబాబుతో పాటు లోకేష్ కు సొంత కుటుంబం దన్ను అంతగా లేకపోయింది. కానీ ఇప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండ తగ్గింది. చంద్రబాబుకు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు విషయంలో కుటుంబ పరంగా ఒక భిన్న వాతావరణం ఉండేది. నందమూరి హరికృష్ణ అండగా నిలిచేవారు. కానీ అదే సమయంలో రెబల్గా కూడా వ్యవహరించేవారు. ఎప్పుడు ఎలా ఉండేవారో తెలియంది కాదు. మరోవైపు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం వ్యతిరేకంగా ఉండేవారు. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులతో చేతులు కలిపారు. మరోవైపు సమీప బంధువు, జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నియా శ్రీనివాసరావు సైతం చంద్రబాబుకు పూర్తిగా వ్యతిరేకంగా మారిపోయారు. ఇలా సొంత కుటుంబ సభ్యులే చికాకుల మీద చికాకులు తెచ్చి పెట్టేవారు. మరోవైపు లోకేష్ ఆశించిన స్థాయిలో పట్టు పెంచుకోలేదు అప్పట్లో.అయితే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఎవరు మనసులో



ఏముంటుందో కూడా చెప్పలేము. అప్పుడు జగన్ కు ఫ్యామిలీ అండగా నిలబడగా.. ఇప్పుడు అదే ఫ్యామిలీ వ్యతిరేకంగా మారిపోయింది. మొదట చెల్లెలు షర్మిల దూరమయ్యారు. ఆమెకు అండగా నిలిచేందుకు జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు తల్లి విజయమ్మ. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసుతో కుటుంబం అంతా అడ్డగోలుగా చీలిపోయింది. మరో చెల్లెలు సునీత పూర్తిగా ప్రత్యర్థిగా మారిపోయారు. ఇప్పుడు కేవలం జగన్మోహన్ రెడ్డి వెంట కుటుంబంలో నిలిచేది అవినాష్ రెడ్డి, ఆయన ఫ్యామిలీ. మిగతా వారంతా దూరమైనట్టే. కేవలం దూరం మాత్రమే కాదు రాజకీయంగా విభేదించడం కూడా మొదలుపెట్టారు. మొన్నటి ఎన్నికల్లో ప్రభావం కూడా చూపారు..అయితే ఇప్పుడు చంద్రబాబు విషయానికి వద్దాం. నందమూరి ఫ్యామిలీ పూర్తిగా ఆయనకు అండగా నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ సైతం మౌనం వహించక తప్పడం లేదు. తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు సైతం రాజీ పడ్డారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపితో తెలుగుదేశం పొత్తుకు పురందేశ్వరి ఒక కారణం. ప్రస్తుతం వారి కుమారుడు సైతం నారా లోకేష్ తో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంకోవైపు నారా రోహిత్ అంటే చంద్రబాబు తమ్ముడి కుమారుడు సైతం లోకేష్ తో కలిసి పని చేస్తున్నారు. ఇంకో వైపు లోకేష్ తోడల్లుడు, నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడు శ్రీ భరత్ సైతం పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు.. ఇలా చెప్పుకుంటే ఫ్యామిలీలు ఇప్పుడు అంతా ఒక్కటై చంద్రబాబుకు అండగా నిలబడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డితో పోల్చుకుంటే చంద్రబాబుకు ఇప్పుడు ఫ్యామిలీ బలం అదనం.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ

**నెల్లూరు :** తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తేలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటీ ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఆది నుంచి మేకపాటి ఫ్యామిలీ వ్యాపార రంగంలో స్థిరపడింది. కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్



చేశారు మేకపాటి. అప్పటినుంచి ఆయన పార్టీ మారుతారు అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. మధ్యలో ఆ ప్రచారానికి పడింది కానీ ఇప్పుడు మళ్లీ మొదలైంది.మేకపాటి రాజమోహన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సన్నిహిత నేత. ఆ అభిమానంతోనే ఎంపీ పదవి విడిచిపెట్టి మరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్మోహన్ రెడ్డి సైతం ఎంతగానో అభిమానం చూపారు ఆ కుటుంబం పై. మేకపాటి గౌతం రెడ్డికి క్యాబినెట్ మంత్రి పదవి ఇచ్చారు. కానీ ఆయన అకాల మరణం చెందారు. తర్వాత మేకపాటి విక్రమ్ రెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. అంతకుమించి ఏ అవకాశం ఇవ్వలేదు ఆ ఫ్యామిలీకి. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు నుంచి బలమైన నేతలు దూరం కావడంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్లు ఇచ్చారు. కానీ ఇద్దరూ ఓడిపోయారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లూరు జిల్లాలో పెద్దదిక్కుగా ఉన్న మేకపాటిని పెద్దగా పట్టించుకోలేదట జగన్. దానిపైనే అసంతృప్తిగా ఉన్న మేకపాటి మొన్న మధ్య జగన్ చుట్టూ ఉన్న కోటరి పై విమర్శలు చేశారు. అయినా సరే జగన్ పిలిచి మాట్లాడాక పోవడంతో పార్టీలో ఉండడం కంటే బయటకు వెళ్ళిపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన టిడిపిలో చేరిక ఖాయమన్న ప్రచారం సాగుతోంది. రాజ్యసభ పదవితో పాటు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే వారసులకు రాజకీయ ప్రాధాన్యం ఇస్తామన్న హామీ తోనే ఆయన పార్టీ మారేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

-మొదటిపేజీ తరువాయి

సమీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,200కు పైగా పోలీస్ స్టేషన్ల నుంచి ఎస్‌హెచ్‌వోలు సహా అధికారులు సమావేశానికి హాజరయ్యారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను సమీక్షిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని చంద్రబాబు ఆదేశించారు.

### గొడ్డలి పార్టీ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలి

మరోవైపు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మంత్రులతో వివిధ అంశాలపై చర్చించారు. "అర్హత లేకున్నా గొడ్డలి పార్టీ జాబ్‌లు ఇచ్చింది. వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 అక్రమాలే ఒక ఉదాహరణ. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎంతో ద్రోహం చేశారు. కోర్టుకు సిట్ సమర్పించిన నివేదిక చూస్తే గ్రూప్-1 అక్రమాలు తెలుస్తాయి. ఎప్పుడూ ఇంత దారుణంగా జవాబుపత్రాల మూల్యాంకనం జరగలేదు. సిట్ హైకోర్టుకు సమర్పించిన నివేదికను ప్రతిఒక్కరూ చూడాలి. నిరుద్యోగులకు చేసిన మోసంపై గొడ్డలి పార్టీని ప్రతిఒక్కరూ నిలదీయాలి. ద్రోహాన్ని కప్పిపుచ్చుకుంటూ డీఎస్సీపై విషం కక్కుతున్నారు. డీఎస్సీపై చేసిన ప్రతి విమర్శనూ గట్టిగానే తిప్పికొట్టాం. గొడ్డలి పార్టీ కుట్రలను ప్రతి ఒక్కరూ దీటుగా తిప్పికొట్టాలి" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.?

### సీఎం సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్‌కు ప్రెసిడెంట్ అవార్డు

ముఖ్యమంత్రి సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ జు. భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ లభించింది. భద్రయ్య ఎస్పీ ర్యాంక్ పోలీస్ ఉన్నతాధికారి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా భద్రయ్యకు ప్రెసిడెంట్ పోలీసు అవార్డ్ ప్రదానం చేయనున్నారు. 35 ఏళ్లకు పైగా పోలీసు సేవలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం ఏపీ స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఎస్పీగా భద్రయ్య కొనసాగుతున్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో 23 ఏళ్లు పనిచేసి వీఐపీ భద్రతలో ప్రత్యేక అనుభవం పొందారు.

## "ప్రజా సమస్యలపై పోరాడతాం"

-మొదటిపేజీ తరువాయి

శాసనసభా పక్ష సమావేశం నిర్వహించిన ఆయన.. ప్రజా సమస్యలపై పోరాటానికి సభ్యులు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మీటింగ్ సారాంశాన్ని వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు తెలియజేశారు.. డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని బొత్స సత్యనారాయణ అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ఆధారాలున్నా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు ఈ అంశంపై పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని చట్టసభలో నిలదీస్తామని తెలిపారు. నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు.

### అభివృద్ధిపై వైఎస్సార్సీపీ విమర్శలు

రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోందని బొత్స ప్రశ్నించారు. అభివృద్ధి అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శలు చేసింది. ప్రజల సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులపై కూడా సమావేశాల్లో ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నాయని, వారి సమస్యలపై కూడా పార్టీ తరపున మాట్లాడతామని తెలిపారు.

### ప్రతిపక్ష హోదాపై పోరాటం

అసెంబ్లీలో ఉన్నవి రెండే పక్షాలు.. మూడోది లేదు కదా. అలాంటిది 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదు? అని చంద్రబాబు ప్రభుత్వాన్ని బొత్స ప్రశ్నించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని, అలాగని చట్టంలో ఉంటే డిస్క్వాలిఫై చేయాలని బొత్స కోరారు. "రాజ్యాంగబద్ధంగానే పోరాడుతున్నాం. ఎక్కడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం లేదు. అయినా ప్రభుత్వాన్ని ఫేక్ పోలీసులతో నడిపిస్తున్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సీఎం కావడం మన ఖర్మ. అందరి తరఫున అడుగుతాం. అన్ని ఆధారాలు చూపిస్తాం. అన్ని విషయాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం" అని బొత్స తెలిపారు.

### మా అధినేత మాటల్లోనే మేము నడుస్తాం మండలి వరకే..

ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంపై నిరసనగా వైఎస్సార్సీపీ శాసనసభ సమావేశాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే నిర్ణయించింది. అయితే శాసన మండలి సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై పోరాడాలని నిర్ణయించింది. ఇక మండలిలో పార్టీ తరఫున డిప్యూటీ చైర్మన్‌గా తూమాటి మాధవరావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండేట్టుగా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగానే తొలి అడుగుగా ఓటర్ల జాబితాల ప్రకటన చేయనుంది.

ఈ క్రమంలో 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఫొటో ఎలక్టోరల్ రోల్స్ ఈనెల 17న ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేఠా ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పోలింగ్ స్టేషన్ల ప్రకటన ఈనెల 21నుంచి ఆరంభమై 31 వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. దాదాపు ఏపీలో ఉన్న 13,000లకు పైగా గ్రామపంచాయతీలు, వందకుపైగా మున్సిపల్ సంస్థలకు సంబందించిన ఫొటో ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ ఎన్నికల సమరానికి నాంది కానుంది.

## సునీత ఒంటరి పోరాటం...

**కడప :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో ఆయన కుమార్తె డాక్టర్ వైఎస్ సునీతారెడ్డి ఎన్నో ఏళ్లుగా వేస్తున్న అత్యంత ప్రాథమిక, కీలకమైన ప్రశ్న ఇదే. ఈ విషయం సీబీఐ అఫిడవిట్‌లోనే ఉంది. బయట ప్రపంచానికి, కనీసం ఇంట్లో పనిచేసే సిబ్బందికి కూడా తెలియక ముందే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి హత్య విషయం ఎలా తెలిసింది? ఈ ఒక్క ప్రశ్నకు చట్టబద్ధంగా విచారణ సంస్థలు సమాధానం కనుగొంటే, హత్య వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులు బయటపడతారని సునీత బలంగా నమ్ముతున్నారు. తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో సైతం మార్చి 15, 2019 ఉదయం 6:15 గంటలకు వివేకా పీఏ కృష్ణారెడ్డి ద్వారా వార్త బయటకు రావడానికి ముందే జగన్‌కు ఈ విషయం తెలుసని పేర్కొనడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది.న్యాయస్థానాల్లో ప్రతిపక్ష డిఫెన్స్ లాయర్లు దీనిపై వాదిస్తూ.. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సమాచారం త్వరగా మార్పిడి కావడం సహజమేనని, దాంట్లో నేరపూరిత కోణం ఏమీ లేదని సరిపెట్టుకునే యత్నం చేశారు. అయితే ఇక్కడే అసలు రాజ్యాంగ, న్యాయపరమైన లోపం స్పష్టమవుతోంది. బంధువులకు సమాచారం అందింది అనే సాధారణ సాకుతో వార్త ఎక్కడి నుంచి వచ్చిందో విచారించకుండా విస్మరించడం సమంజసం కాదనేదిసునీత వాదన. హత్య జరిగిన అర్ధరాత్రి దాటిన సమయం నుంచి ఉదయం వరకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఫోన్ నుంచి నడిచిన వాట్సాప్, వాయిస్ కాల్స్ ఐపీడీఆర్ డేటాను సీబీఐ అఫిడవిట్‌లో ప్రస్తావించినప్పటికీ, ఆ సమాచారం కనెక్షన్ చివరగా ఎక్కడ ముగిసిందో పూర్తి స్థాయిలో మనీ-పవర్ ట్రయల్‌తో ముడిపెట్టి తేల్చకపోవడమే అసలు వివాదం.న్యాయం కోసం సునీత పడుతున్న తపన, సాగిస్తున్న పోరాటం సాధారణమైంది కాదు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు వరకు, ఏపీ నుంచి విచారణను తెలంగాణకు బదిలీ చేయించడం వరకు ఆమె అలుపెరగకుండా పోరాడుతున్నారు. హత్య వెనుక ఎవరున్నారనేది ప్రజలందరికీ ఒక అంచనా ఉన్నప్పటికీ.. దానిని చట్టబద్ధమైన సాక్ష్యాధారాలతో కోర్టు ముందు రుజువు చేసి, నిందితులకు శిక్ష పడేలా చేయడమే ఆమె అంతిమ లక్ష్యం. ఏడేళ్లు గడిచినా ఒక మాజీ ఎంపీ కుమార్తె న్యాయం కోసం వ్యవస్థల చుట్టూ తిరగాల్సి రావడం భారతీయ నేర విచారణ వ్యవస్థ లోని మందగమనానికి అద్దం పడుతోంది.ఈ తరుణంలోనే సునీత నేరుగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, కేసులోని పెద్ద కుట్ర కోణాన్ని, ముందస్తు సమాచారం ఎవరికి ఎలా చేరిందనే అంశాన్ని త్వరితగతిన తేల్చాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధ అత్యున్నత పీఠం జోక్యం చేసుకుని సీబీఐ దర్యాప్తునకు స్పష్టమైన కాలపరిమితిని, దిశానిర్దేశాన్ని ఇస్తే తప్ప ఈ కేసు ముడిపడేలా లేదు.

# హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన పై కళాజాతాల ప్రచారం





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 12:** జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన పై ప్రజల్లో కళాజాతాల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమం.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఆవరణలో బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ( ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపైన్) హెచ్ఐవి "ఎయిడ్స్ అవగాహన అందరి బాధ్యత" గోడపత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు నెలలపాటు ఎయిడ్స్ నియంత్రణ, అవగాహన పై కళా జాతాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా హెచ్ఐవి వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, పరీక్షలు, చికిత్స పై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. యువత హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ చాలావరకు అదుపులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది అన్నారు. సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేప్రోసి, ఎయిడ్స్, టిబి అధికారి డా. కె. స్వప్న, దిశ సిఎస్ఓ డా. స్పందన, ఎన్జిఓస్, మెడికల్ సిబంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం






**పరవాడ, పెన్ సత్తా, ఆగస్ట్ 12:** ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, పరవాడ మండలంలో ఆక్సెప్ట్ మైగ్రేంట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆక్సెప్ట్ మైగ్రేంట్స్ ప్రాజెక్ట్ మేనేజర్ కె. వెంకట లక్ష్మి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హెచ్ఐవి వ్యాప్తి చెందే మార్గాలు, హెచ్ఐవి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవడం, అవసర మైన వారికి వైద్య సేవలు, చికిత్స పొందడం వంటి అంశాల పై అవగాహన కల్పించారు.

అలాగే యువతకి, వలస కార్మికులకు, ఐఈసి కరపత్రాల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ, పరీక్షలు, చికిత్స పై అవగాహన కల్పించారు. హెచ్ఐవి పై ఉన్న అపోహలను తొలగించి, అనుమానం ఉన్నప్పుడు లేదా అవసర మైన సందర్భంలో హెచ్ఐవి పరీక్షలు చేయించు కోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఐసీటీసీ వాన్ ద్వారా మొత్తం 57 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ ఎల్. అర్జున్, ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్, అలాగే ఆక్సెప్ట్ మైగ్రేంట్స్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అస్సాం వరద బాధితులకు జిల్లా కలెక్టర్ ఉద్యోగుల భారీ వితరణ.

**లక్ష్యాన్ని మించి రూ.26.74 లక్షల నిధుల సేకరణ -- జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్.**




**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 12:** అస్సాంలో సంభవించిన వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు అనకాపల్లి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఇతరుల భాగస్వామ్య మై సహకారంతో రూ. 26,74,296/- నిధులను సేకరించినట్లు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. అస్సాం వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. అస్సాం వరద సహాయ నిధి కోసం అనకాపల్లి జిల్లా నుంచి రూ. 10 లక్షల నిధులు సేకరించాలని ప్రారంభ లక్ష్యంగా నిర్ణయించామని, అయితే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఇతరుల సమిష్టి కృషి, ఉదారత నిర్దేశించిన లక్ష్యానికి రెండున్నర రెట్లకు పైగా, మొత్తం రూ. 26,74,296/- నిధులను సేకరించగలిగామని కలెక్టర్ తెలిపారు.

సేకరించిన మొత్తాన్ని పారదర్శకంగా, నేరుగా అస్సాం వరద బాధితులకు సహాయపడే విధంగా సంబంధిత అధికారులకు అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఆమె వెల్లడించారు. ఈ మేరకు చెక్ నంబర్ 016251, తేదీ 12-08-2026 ద్వారా రూ. 26,74,296/- మొత్తాన్ని అస్సాం లోని సంబంధిత డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌కు నేరుగా బదిలీ చేసేందుకు చెక్కును అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇది సమిష్టి సహకారంతో లక్ష్యానికి మించి సేకరణ అని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సమయంలో బాధిత ప్రజలకు సహాయం చేయడంలో అనకాపల్లి జిల్లా ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అస్సాం రాష్ట్రంలో వరదల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఆపన్నహస్తం అందించాలనే ఉద్దేశంతో జిల్లా స్థాయిలో నిధుల సేకరణకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర భాగస్వాములు స్పందించి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి చిన్న సహకారం కలిసినప్పుడు అది పెద్ద మొత్తంగా మారి ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రకృతి విపత్తులు ఎక్కడ సంభవించినా మానవత్వంతో స్పందించడం మన బాధ్యత. అస్సాం వరద బాధితులకు అనకాపల్లి జిల్లా ప్రజలు, అధికారులు మరియు సిబ్బంది అందించిన సహకారం స్ఫూర్తిదాయకం. లక్ష్యంగా పెట్టుకున్న రూ. 10 లక్షలకు బదులుగా రూ. 26,74,296/- సేకరించడం అందరి సమిష్టి కృషికి నిదర్శనం అని జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ పేర్కొన్నారు.

అస్సాం వరద సహాయ నిధికి సంబంధించిన చెక్కు అందజేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) రామారావు తదితర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అస్సాం వరద బాధితులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అధికారులు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలని ఆమె ఆకాంక్షించారు.

# ఉద్దండపురం వాటర్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన కలెక్టర్, సుందరపు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 12:** రాజయ్యపేట లో ఏర్పాటు చేయనున్న మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) స్కూల్ తుపాను భవనాన్ని బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. ఇక్కడ స్టూడెంట్స్ కోసం ఎన్ని గదులు ఏర్పాటు చేశారు, టాయిలెట్స్ ఎన్ని ఉన్నాయి మొదలగు విషయాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారు, డైనింగ్ ప్లేస్ పరిశీలించారు. ఇంకా కొన్ని పనులు బాగా చేయించాలని అధికారులకు ఆదేశించారు. మంచినీటి కోసం ఏర్పాట్లను చూసారు. త్వరలోనే ప్రవేశాలు ఉంటాయని పిల్లలను బాగా చదివించాలని మత్స్యకారులకు సూచించారు. ఇక్కడ పది మంది మత్స్యకారులకు 20 వేలు నగదు రాలేదని పీక్కి సత్తయ్య, తదితరులు కలెక్టర్ కు కోరగా, పరిష్కారం చేస్తామని కలెక్టర్ అన్నారు. ఉద్దండపురంలో వాటర్ ప్రాజెక్టు పనులను శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటర్ ట్యాంక్ లు చూసారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల ప్రక్రియ అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ రామస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటన కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, డిఈఈ జయరాం, ఎమ్మార్వో, ఎండిఓ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అంగీకారం లేకుండా భూసేకరణ జరగదు




**జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్**

**కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేసిన కాగిత రైతులు**

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 12:** రైతుల అంగీకారం లేకుండా ఎటువంటి భూసేకరణ జరగదని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ స్పష్టం చేశారు. మండలంలో కాగిత రెవెన్యూ పరిధిలో భూములను అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు భూ బదలాయింపు చేస్తున్నట్టు నోటీసులు వచ్చాయని తక్షణమే వాటిని రద్దు చేయాలని కాగిత గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ను కోరారు. బుధవారం నక్కపల్లి మండలం రాజయ్యపేట పర్యటనకు వచ్చిన ఆమెను కాగిత రైతులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలోకలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాగిత గ్రామ రెవెన్యూ పరిధిలో చెరువులు, గెడ్డవాగులు, రాస్తాలు, పాత గ్రామకంఠం సుమారు 17 ఎకరాల భూమిని అరిసిల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కు బదలాయిస్తున్నట్టు రెవెన్యూ కార్యాలయం నుండి గ్రామ సచివాలయానికి నోటీసు రావడం జరిగిందన్నారు. దీనిపై గ్రామ రైతులు తమ అభ్యంతరాలను 15 రోజుల్లోగా తెలియజేయాలని నోటీసులో పేర్కొనడం జరిగిందన్నారు. ఇప్పటికే ఇదే రెవెన్యూలో ఏపీఐఐసీ ద్వారా చేపడుతున్న స్టీల్ ప్లాంట్ రోడ్డు కొరకు సుమారు 30 ఎకరాలు త్యాగం చేయడం జరిగిందన్నారు. గ్రామానికి అతి సమీపంలో ఉన్న చెరువులు, గెడ్డావాగులు సేకరిస్తే చెరువులకు వచ్చే నీటి మార్గాలు మూసుకుపోయి చెరువులు ఎండిపోయి పొలాలు బీడు భూములుగా మారతాయన్నారు. భూములే జీవనాధారంగా బ్రతుకుతున్న ఎన్నో కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని కాగిత రెవెన్యూ పరిధిలో పరిశ్రమల కొరకు ఎటువంటి నిర్మాణాలు భూ కేటాయింపులు చేయరాదని కాగిత రైతులందరూ జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ను కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ రైతుల అభీష్టం మేరకే భూసేకరణ జరుగుతుందని రైతులకు వ్యతిరేకంగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టబోమని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు దేవవరపు శివ, పోతంశెట్టి బాబ్జి, గుమ్మల్ల గోవిందరావు, దేవవరపు గోవిందరావు, సత్యనారాయణ జమీలు, పోతంశెట్టి వీరబాబు, గోవిందు, గణేష్, కొండబాబు గంగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# స్టీల్ ప్లాంట్ రోడ్ లో రైతులకు అనువైన క్రాసింగ్ ఏర్పాటు చేయాలి

**జిల్లా కలెక్టర్ ని కోరిన కాగిత రైతులు**

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 12:** మండలంలో కాగిత జాతీయ రహదారి నుండి నూతనంగా ఏర్పాటు చేస్తున్న పిసిపిఐఆర్ ( స్టీల్ ప్లాంట్) రోడ్డు లో రైతులకు అనువైన క్రాసింగ్ ( యూటర్న్ )ఏర్పాటు చేయాలని కాగిత గ్రామానికి చెందిన పలువు రైతులు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ను కోరారు. బుధవారం నక్కపల్లి పర్యటనకు వచ్చిన కలెక్టర్ విజయ్ కృష్ణన్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ రోడ్డు నిర్మాణంలో మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. రోడ్డు ఎగువ ప్రాంతంలో ఉన్న తమ భూములలోకి వెళ్లేందుకు పూర్వం నుండి ఉన్న గ్రావెల్ రోడ్డు వద్ద కాకుండా 400 మీటర్ల దూరంలో వేరొక చోట యూటర్న్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు రెండు వైపులా రాంగ్ రోడ్డు ప్రయాణం చేయవలసి వస్తుందని దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్ వద్ద గోడు వెల్లబుచ్చారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న భూములు లోకి రాకపోకలు సాగించేందుకు రైతులు కోరిన విధంగా వారికి అనుకూలమైన ప్రాంతంలో యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, తల్లా భార్గవ్, రైతులు దేవరపు శివ, పోతంశెట్టి బాబ్జి వీరబాబు, గుమ్మల్ల గోవిందరావు, జమీలు, దేవరపు గోవిందరావు తదితరులు ఉన్నారు.



# అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన వీసం రామకృష్ణ

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగష్టు 12:** నక్కపల్లి మండలంలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ కు ఫిర్యాదు చేశారు. బుధవారం నక్కపల్లి పర్యటనకు వచ్చిన కలెక్టర్ ను కలిసి మెమొరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో అమలాపురం, వేంపాడు,నెల్లిపూడి, పెదబోదిగల్లం, గునుపూడి, ఉద్దండపురం తదితర గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా యదేచ్ఛగా వందలాది మెట్రిక్ టన్నుల గ్రావెల్ తరలించకపోతున్న అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. మండలంలో అనేక చోట్ల అనధికారి లేఅవుట్లు ఏర్పాటుచేసి గ్రావెల్ మట్టి తరలించకపోతున్నారని దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు తీర ప్రాంతాల్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఏపీఐఐసీ పరిధిలో ఉన్న కొండలను తవ్వి అక్రమార్కులు గ్రావెల్ మట్టి తరలించకుపోతున్నారని వివరించారు. మండలంలో ఇప్పటివరకు జరిగిన గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొర్ల గోవిందు, తల్లా భార్గవ్, పోతంశెట్టి బాబ్జి తదితరులు ఉన్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలను మరింత సమర్ధవంతంగా అందించాలి.




జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి.

**విశాఖపట్నం పెన్ సత్తా, ఆగష్టు 12:**ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, రేషన్ పంపిణీ, దీపం-2 పథకం, ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలు, మీ మార్ట్ కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో ఎటువంటి లోపాలకు తావు లేకుండా పారదర్శకంగా సేవలు అందించాలన్నారు.

జిల్లాలో ప్రస్తుతం 642 ఫెయిర్ ప్రైస్ దుకాణాల ద్వారా 5,28,863 రేషన్ కార్డులకు చెందిన సుమారు 16 లక్షల మంది లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు వివరించారు.ఈ నేపథ్యం లో రేషన్ సరుకుల నాణ్యత సరఫరా పంపిణీ ప్రక్రి యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జేసీ సూచిం చారు. అన్ని ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో ఈ-పాస్ విధా నం సమర్ధవంతంగా అమలవుతోందని, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే డోర్ డెలివరీ సేవలను మరింత మెరుగుపరచాలని ఆమె సూచించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్, ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకాల కింద పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లకు కేటాయించే బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.దీపం-2 పథకం అమలులో అర్హులైన లబ్ధిదారులందరికీ సబ్సిడీ ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, ఎల్పీజీ కనెక్షన్లకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ కింద రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాల పనితీరును సమీక్షించిన ఇంచార్జి కలెక్టర్, నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు వినియోగదారులకు అందించేందుకు చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా బహిరంగ మార్కెట్లో ధరల నియంత్రణకు తోడ్పాటు అందించాలన్నారు. అలాగే జిల్లాలో 75 ఫెయిర్ ప్రైస్ దుకాణాల్లో అమలు చేస్తున్న "మీ మార్ట్" కార్యక్రమాన్ని మరింత విస్తరించి, రేషన్ కార్డు దారులకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఫెయిర్ ప్రైస్ దుకాణాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి అధికారులను ఆదేశించారు.సమావేశంలో డీఎస్వో భాస్కరరావు, ఏఎస్వో కళ్యాణి, సివిల్ సప్లైస్ డీఎం సృజన, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె. రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, లీగల్ మెట్రాలజీ ఏసీ రాధాకృష్ణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పలువురు డీలర్లు, చెకింగ్ ఇన్స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 13 కొత్త 'తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలు ప్రారంభం.

జిల్లా కలెక్టర్ నిషాంతి. టి

**పాడేరు పెన్ సత్తా, ఆగష్టు 12:**జిల్లాలో 13 నూతన తల్లి బిడ్డ ఎక్స ప్రెస్ వాహనాలను జిల్లా కలెక్టర్ నిషాంతి బుధవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్, పాత వాహనాల స్థానంలో నూతన వాహనాల పునరుద్ధరణ చేపట్టారు.రెండు విడతల్లో మొత్తం 23 వాహనాల ఆధునీకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలు రోజుకు సగటున 50 మంది బాలింతలు, నవజాత శిశువులకు సురక్షిత ఉచిత రవాణా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, నవజాత శిశు వులను సురక్షితంగా ఇళ్లకు చేర్చే ఉచిత రవాణా సేవల కోసం కేటాయించినట్లు 13 కొత్త 'తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్' వాహనాలను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గడ్డి ఈశ్వరి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇతర అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ప్రస్తుతం నడుస్తున్న పాత వాహనాల స్థానంలో ఈ నూతన వాహనాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా మొత్తం 23 తల్లిబిడ్డ ఎక్స్ప్రెస్ వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో మొదటి దశ కింద 13 కొత్త వాహనాలను నేడు ప్రారంభించామని, మిగిలిన 10 వాహనాలను రెండవ దశలో త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.ఈ




సేవ ద్వారా జిల్లావ్యాప్తంగా రోజుకు సగటున 50 మంది తల్లులను, నవజాత శిశువులను ప్రభుత్వ ఆసుపత్రుల నుండి వారి ఇళ్లకు సురక్షితంగా దింపడం జరుగుతోందన్నారు. కొత్త వాహనాల రాకతో మారుమూల ప్రాంతాల్లోని బాలింతలకు, పసిపిల్లలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందుతాయని వారు పేర్కొన్నారు.

ఈ వాహన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపీపీలు బొర్ర విజయ రాణి, రమణమూర్తి, జిల్లా వైద్యారోగ్య అధికారి, ఇతర జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయండి




సర్వే శాఖ ఆర్జేడీ వీఎస్ఎన్.కుమార్.

**పాడేరు పెన్ సత్తా, ఆగష్టు 12:**భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సర్వే శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్. కుమార్ ఆదేశించారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నందు జిల్లా సర్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు కృషి చేయాలని ఆయన
సూచించారు. సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఆయా శాఖల అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా ఈ రీ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మొత్తం 1400 గ్రామాలలో రీ సర్వే చేయుటకు నిర్ణయించి మొదట విడతగా 493 గ్రామాలు సర్వే ప్రారంభించడం జరిగిందన్నారు. రెండవ విడతలో 454, మూడో విడత 450 గ్రామాలలో సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. మొదటి విడత లోని 493 గ్రామాల్లో 96 గ్రామాలు విస్తీర్ణం 24,640 ఎకరములు రీ సర్వే పూర్తి అయ్యిందన్నారు.11 మండలాల పరిధిలో సర్వేయర్లకు, రీ సర్వే డీటీలకు రెవెన్యూ సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధదల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు.పెండింగ్లో ఉన్న పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షించి, త్వరిత గతిన పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సకాలంలో సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలనిసూచించారు. రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు.

రికార్డులను భద్రపరచుటలో డిజిటలైజేషన్ అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించా లని, రెవెన్యూ సేవలకు సంబంధించిన సాంకేతిక అంశాలు నూతన విధానాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కారం మార్గం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిడి హరికృష్ణ, జిల్లా సర్వే అధికారి ఈశ్వర దొర, డిఐఓఎస్ జి.వెంకటరావు, సునీల్ వరాహాలరావు సిల్వర్ లైన్ టెక్నో సొల్యూషన్స్ ప్రతినిధి, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ





**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఆగష్టు 12:**అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మరింత మెరుగైన ప్రాథమిక విద్య అందించేందుకు నిర్వహిస్తున్న మూడు రోజుల 'జ్ఞానజ్యోతి' శిక్షణ కార్యక్రమం రెండో రోజు బుధవారం అచ్యుతాపురం జడ్పీ పాఠశాలలో జరిగింది. శిక్షణలో భాగంగా ఎంఈఓ(2) ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సుహాసిని, సూపర్వైజర్ డి. పద్మావతి, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల వయసు, అవగాహన స్థాయికి అనుగుణంగా బోధన సాగించే విధానాలపై అవగాహన కల్పించారు. ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యక్రమాలను ఉపయోగించి పిల్లల్లో ఆసక్తిని పెంచడం, శారీరక, మానసిక వికాసానికి దోహదపడే కార్యకలాపాలను నిర్వహించే తీరును వివరించారు. చిన్నారుల తొలి దశలోనే భాష, సంఖ్యా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందిస్తే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని శిక్షకులు తెలిపారు. కార్యకర్తల సందేహాలను నివృత్తి చేస్తూ, పిల్లలతో ఆహ్లాదకర వాతావరణంలో బోధన నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నక్క అప్పలనాయుడు, దోని నూకరాజు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కే కోటపాడు 50 పడుకుల ఆసుపత్రి వైద్య సేవలు పై సర్వసభ్య సమావేశంలో నిలదీత.





**పెన్ సత్తా, ఆగష్టు 12:** కే.కోటపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొని మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు.

కే.కోటపాడు 50 పడకల ఆసుపత్రిలో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని కొరువాడ ఎంపీటీసీ చీపురుపల్లి అచ్చిబాబు వైద్యాధికారులను నిలదీశారు. కనీసం బీపీ మాత్రలు కూడా అందుబాటులో ఉండటం లేదని, రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులను విశాఖపట్నంలోని వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు.

అలాగే డ్వాక్రా మహిళలను ఫొటోల పేరుతో ప్రతి నెలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రొంగలి నాయుడుపాలెం ఎంపీటీసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనివల్ల వృద్ధులు, వ్యవసాయదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సమావేశంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్‌తో పాటు ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ నాగరాజు అప్పలరాజు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# వైయస్ జగన్ ని కలిసిన దద్దాల నారాయణ

**పెన్ సత్తా, ఆగష్టు 12:**:వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలనీ,ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని,హామీ మేరకు నిరుద్యోగ వృతి రూ. 3 వేలు వెంటనే ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కనిగిరి నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు సందర్భంగా మొదటి రోజు దీక్ష భగ్నం తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదు చేసిన అక్రమ కేసులు,తన అక్రమ అరెస్టుతో పాటు పలు కీలక అంశాలు జగన్ కి వివరించినట్లు ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.అక్రమ కేసులకు ఎవరూ అధైర్య పడవద్దని,నాతో పాటు మన పార్టీ లీగల్ సెల్ అండగా ఉంటుందని భరోసా కల్పించారన్నారు.ఇదే విధంగా ప్రజా సమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం చేశారన్నారు.నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహణ, కష్టకాలంలో కార్యకర్తలకు,నాయకులు అండగా నిలబడుతున్న తీరుకు,రిలే నిరాహార దీక్షలు,నిరసన ర్యాలీ విజయవంతం పట్ల వైఎస్ జగన్ సంతృప్తి వ్యక్తం చేసి అభినందించి నట్లు పత్రికా ప్రకటనలో దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

# అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అజెండా ఇదే.. ఫిక్స్ అయిన జగన్

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై విపక్షం వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17 నుంచి శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు మొదలు కానున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఈ ఏర్పాట్లు చేస్తుండగా, సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అదేసమయంలో శాసనసభతోపాటు మండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వెళ్లాలని నిర్ణయించారు. అదేసమయంలో శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీసేలా పలు అస్త్రాలను సిద్ధం చేయాలని చర్చించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని వైసీపీ నిర్ణయించింది. శాసనమండలి సమావేశాల్లో ఇదే ప్రధాన అజెండాగా చర్చకు పట్టుబడాలని ఆ పార్టీ నిర్ణయించిందని చెబుతున్నారు. అంతేకాకుండా మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని ఒత్తిడి చేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మాజీ సీఎం జగన్ రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. శాసనమండలికి యథావిధిగా హాజరుకావడంతోపాటు అసెంబ్లీ బయట రకరకాల కార్యక్రమాలతో డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు.

ఇక అసెంబ్లీ ప్రారంభానికి ఐదు రోజులు ముందుగానే విపక్షం అజెండా ఫిక్స్ చేయడం రాజకీయంగా హాట్ టాపిక్



అవుతోంది. ఇప్పటికే డీఎస్సీ స్పోర్ట్సు కోటాలో అక్రమాలపై వైసీపీ అనేక రకాలుగా ఆందోళనలు చేస్తోంది. రిలే నిరాహారదీక్షలతోపాటు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భావిస్తున్న ప్రతిపక్ష సభ్యులు ఈ విషయంపై శాసనమండలిలో తాడోపేడో తేల్చుకుంటామని తేల్చిచెప్పడంతో వర్షాకాల సమావేశాలకు ముందే రాజకీయం కాకపుట్టిస్తోందని చెబుతున్నారు.

విపక్షం అజెండా ఎలా ఉండబోతుందో తేలిపోవడంతో ఇక ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. అసెంబ్లీకి రామని చెబుతున్న వైసీపీ తమ ఆరోపణలు మాత్రం ఆపమని తేల్చిచెబుతోంది. దీంతో విపక్షానికి సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ఏ మార్గం ఎంచుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది. శాసనమండలిలో ఇప్పటికీ విపక్షానికే బలం ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వ వాదనను సమర్థంగా తీసుకువెళ్లే అవకాశాలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో బలం ఉన్నప్పటికీ వైసీపీ సభ్యులు హాజరుకాకపోవడం వల్ల చర్చలు ఏకపక్షంగా సాగిపోనున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వ వాదన ప్రజల్లోకి వెళుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ అసెంబ్లీ అజెండాపై వైసీపీ ముందుగానే స్పష్టత ఇవ్వడంతో ఈ సారి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా కొనసాగే పరిస్థితులు ఏర్పడ్డాయని అంటున్నారు.

# ఇంటెలిజన్స్ వైఫల్యమేనా అధికార పార్టీలో అనుమానాలు

కర్నూలులో శాంతి భద్రతల సమస్యలపై మంత్రి టీజీ భరత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. ఒకవైపు హోం మంత్రి అనిత లా అండ్ ఆర్డర్ బాగుందంటూ చెబుతూ ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సయితం రౌడీషీటర్లను పీచమణిచేస్తానని ప్రతి సభలో హుంకరిస్తున్నారు. కానీ చంద్రబాబు మంత్రివర్గంలో సభ్యుడిగా ఉన్న టీజీ భరత్ మాత్రం కర్నూలులో ఇంటలిజెన్స్ తో పాటు అధికార వ్యవస్థ కూడా పూర్తిగా విఫలమయిందని ఆరోపణలు చేయడం సూటిగా కూటమి ప్రభుత్వానికి తాకినట్లయింది. మంత్రి టీజీ భరత్ ఈ వ్యాఖ్యలు ఆయన ఆవేదనలో భాగమయి ఉండవచ్చు. కానీ అది ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే విధంగా ఉన్నాయంటూ పెద్దయెత్తున ప్రత్యర్థులు దానిని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు... కర్నూలులో టీడీపీ కార్యకర్త ఇంతియాజ్ హత్య ఘటనపై పోలీసుల నిఘా వైఫల్యమంటూ ఏపీ మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు ముందే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎందుకు స్పందించలేదని నిలదీశారు.ద

మంత్రుల కదలికలపై నిఘా పెట్టే అధికారులు నేరస్థులపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.పోలీసుల తీరుపై మంత్రి టీజీ భరత్ అసంతృప్తి కర్నూలులో శాంతిభద్రతల పరిరక్షణలో మరియు నిఘా వ్యవస్థ పనితీరులో స్పష్టమైన వైఫల్యం కనిపిస్తోందని మండిపడ్డారు.హత్యకు ముందే బాధితుడి ఫొటో పెట్టి సోషల్ మీడియాలో '=ఖా' అని పోస్ట్ చేసినా పోలీసులు గుర్తించలేకపోవడంపై అసంతృప్తి వెళ్లి బుచ్చారు.మంత్రులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారనే విషయాలపై ఉండే శ్రద్ధ.. నేరస్థుల కదలికలపై ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు.ఈ ఘటనపై సీఎంను కలిసి ఫిర్యాదు చేస్తానని, రౌడీ మూకల అరాచకాలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. కర్నూలులో రౌడీలు రెచ్చిపోతున్నారని మంత్రి భరత్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

హత్యలకు తెగబడుతున్నారని మంత్రి భరత్ఇంతియాజ్ హత్య అంటూ వారం క్రితమే సోషల్ మీడియాలో వచ్చిందని, మంత్రులు,

ఎమ్మెల్యేలు, నేతలపై వాళ్లు నిఘా పెడుతుంటే..పోలీసులు ఏం చేస్తున్నారంటూ మంత్రి భరత్ ప్రశ్నించడం కూటమి ప్రభుత్వంలోని శాంతి భద్రల సమస్యను ఎత్తి చూపుతుందని విపక్ష వైసీపీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమయిందని, అందుకు తాము కాదని, మంత్రి భరత్ వ్యాఖ్యలే ఉదాహరణ అని చెబుతున్నారు. తన పార్టీ నేత హత్యతో ఆవేదనకు గురైనా మంత్రి టీజీ భరత్ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలుగా చూడాలని కూటమిలోని నేతలు సర్దిచెప్పుకుంటున్నా.. అది ప్రభుత్వాన్ని మాత్రం డ్యామేజీ చేసే విధంగా ఉందన్న వ్యాఖ్యలు మాత్రం వినిపిస్తున్నాయి. దీనిపై టీజీ భరత్ ను పార్టీ నాయకత్వం వివరణ కోరే అవకాశాలు లేకపోలేదు.

# కోవర్ట్ రాజకీయాలు - టీడీపీ వర్గాల అనుమానాలు

ప్రకాశం జిల్లా ముఖ్యంగా ఒంగోలు నియోజకవర్గంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి , స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ల మధ్య తలెత్తిన రాజకీయ వైరం తీవ్ర రూపం దాల్చుతోంది. వైఎస్సార్సీపీ ని వీడి జనసేనలో చేరినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి స్థానిక ఎమ్మెల్యే దామచర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించడం, దానికి ప్రతిగా దామచర్ల కూడా సవాళ్లు విసరడంతో ఒంగోలు రాజకీయాలు కూటమి వర్సెస్ కూటమి అనే స్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, దామచర్ల కుటుంబాల మధ్య రాజకీయ వైరం దశాబ్దాలుగా కొనసాగుతోంది. గతంలో ఇరు నాయకులు ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీపడేవారు. అయితే బాలినేని జనసేన పార్టీలో చేరినప్పటికీ, పాత విభేదాలు మాత్రం వీడలేదు. ఒంగోలుపై తన పట్టు నిలుపుకోవాలని బాలినేని ప్రయత్నిస్తుంటే, సిట్టింగ్ ఎమ్మెల్యేగా పూర్తి ఆధిపత్యం చెలాయించాలని దామచర్ల భావిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం ఒంగోలు రాజకీయాన్ని శాసించడమే కావడంతో ఈ ఘర్షణ వ్యక్తిగత స్థాయికి చేరింది. తాజాగా బాలినేని తన అనుచరులను కాపాడుకునేందుకు నేరుగా రంగానికి దిగారు. స్థానిక పోలీసులు ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిళ్లతో తన వర్గానికి చెందిన వారిపై, జనసేన కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి కౌంటర్‌గా.. వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అక్రమాల నుంచి తప్పించుకోవడానికే బాలినేని జనసేన ముసుగు వేసుకున్నారని, ఒంగోలులో రౌడీయిజం చెల్లదని దామచర్ల విమర్శలు గుప్పించడంతో పరిస్థితి తీవ్రమైంది.జనసేనలో చేరినప్పటికీ బాలినేని వైఎస్సార్సీపీ నాయకులకు మద్దతుగా పనిచేస్తున్నారని, టీడీపీ-జనసేన కూటమిలో చిచ్చు పెట్టేందుకు 'కోవర్ట్'గా వ్యవహరిస్తున్నారని టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా విమర్శిస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్సీపీ నేతలపై విచారణ జరగకుండా అడ్డుకోవడానికి , తన పాత కేడర్‌ను కాపాడుకోవడానికి జనసేన జెండాను వాడుకుంటున్నారనే ఆరోపణలు టీడీపీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. నాయకుల మధ్య సాగుతున్న ఈ పోరు సోషల్ మీడియా వార్‌గా మారి, ఇప్పుడు నేరుగా వీధుల్లోకి వచ్చే వాతావరణం కనిపించడం వల్ల టీడీపీ, జనసేన దిగువ స్థాయి కేడర్ తీవ్ర గందరగోళానికి గురవుతోంది. ఎన్నికల్లో కలసి పనిచేసిన రెండు పార్టీల శ్రేణులు ఇప్పుడు పరస్పరం పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేయడం, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం వల్ల ఉమ్మడి క్యాడర్ స్ఫూర్తి దెబ్బతింటోంది.ఒంగోలులో సాగుతున్న ఈ అంతర్గత పోరు కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి నేతలే ఒకరిపై ఒకరు ఇసుక, మద్యం అవినీతి ఆరోపణలు చేసుకోవడం ప్రతిపక్ష వైఎస్సార్సీపీకి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారింది. ఈ సెగ కేవలం ఒంగోలుకే పరిమితం కాకుండా ప్రకాశం జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు పాకితే, కూటమిలోని టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య సఖ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది.పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో టీడీపీ, జనసేన అధిష్టానాలు త్వరితగతిన స్పందించాయి. ఇరు పార్టీల సీనియర్ నేతలు కలసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, ఇద్దరు నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. బహిరంగ విమర్శలు ఆపి, ఏవైనా సమస్యలు ఉంటే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి - దామచర్ల జనార్ధన్ ల మధ్య పోరు కేవలం ఒక స్థానిక నియోజకవర్గ సమస్య కాదు. స్థానికంగా బలంగా ఉన్న పాత ప్రత్యర్థులు కూటమి గొడుగు కిందకి వచ్చినప్పుడు తలెత్తే సవాళ్లకు ఇది అద్దం పడుతోంది. అధిష్టానాలు వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ వ్యక్తిగత ఆధిపత్య పోరు కూటమి ఓటు బ్యాంకును దెబ్బతీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

మరో వైపు సమన్వయ కమిటీ నాయకులు ఒంగోలు పరిణామాలకు సంబంధించిన వివరాలను సంబంధిత నేతల నుంచి నేరుగా తెలుసుకునేందుకు జూమ్ ద్వారా మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను విన్న అనంతరం సమస్యలు ఏమైనా ఉంటే పార్టీ వ్యవస్థలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి లేదా కూటమికి ఇబ్బంది కలిగించేలా బహిరంగ వ్యాఖ్యలు చేయడం వల్ల రాజకీయంగా ప్రత్యర్థులకు అవకాశం కల్పించినట్లవుతుందని హెచ్చరించారు.నేతలు తమ సమస్యలను పార్టీ అధిష్టానాలు, సమన్వయ కమిటీల దృష్టికి తీసుకురావచ్చని స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనలో ముందుకు సాగుతున్న సమయంలో చిన్నపాటి విభేదాలు పెద్ద రాజకీయ అంశాలుగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని పేర్కొన్నారు. కూటమి బలంగా ఉంటేనే ప్రభుత్వానికి రాజకీయ స్థిరత్వం కొనసాగుతుందని, అందువల్ల వ్యక్తిగత విభేదాల కంటే సమిష్టి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఒంగోలు వివాదంపై తాజా చర్యలతో ఇకపై కూటమి భాగస్వామ్య పార్టీల నేతల మధ్య సమన్వయానికి మరింత ప్రాధాన్యం దక్కే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ విమర్శలకు దూరంగా ఉండి, సమస్యలను అంతర్గత చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న సందేశాన్ని నాయకత్వం స్పష్టంగా ఇచ్చినట్లయింది.

## బలవంతపు నిరసనలతో బలం పెరిగేనా



వైఎస్ జగన్ వ్యూహం తప్పుతున్నట్లు కనిపిస్తుంది. ఆయన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేయడమే కాకుండా దీనికి ఎండ్ కార్డు మాత్రం పడే అవకాశం లేదు. టీడీపీ ప్రస్తుతం కూటమిలో ఉంది. కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. కేంద్రం నుంచి కూడా స్పందన వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఈ పోరు కు అంతం లేదు. కాకుంటే ఆంధ్రప్రదేశ్ లో నిరుద్యోగ యువత నుంచి కొంత మద్దతు దొరుకుతుందేమోనని వైసీపీ భావించి మెగా డీఎస్సీలో అవకతవకలంటూ ఆందోళనలు, నిరసనలు కంటిన్యూ చేస్తుంది. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్న వైసీపీ నేతలకే దీని వల్ల రాజకీయ ప్రయోజనం ఎంత వరకూ వస్తుందన్నది కూడా అంతు చిక్కకుండా ఉంది. కానీ పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు ఆందోళనలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. వైసీపీ చేపట్టిన ఆందోళనల వల్ల ప్రయోజనం ఎంత మేరకు ఉంది? బలవంతపు నిరసనలుగానే కనిపిస్తుంది. ఈ ఆందోళనల్లో యువత పెద్దగా పాల్గొనకపోవడం కూడా చర్చనీయాంశమైంది. టీడీపీ దీనిని హైలెట్ చేస్తుంది. మెగా డీఎస్సీ రాసిన వారు ఎవరూ ఈ ఆందోళనల్లో పాల్గొనకపోవడంతోనే వైసీపీ ఆందోళనలు, నిరసనలు వృథా ప్రయాస అని అంటున్నారు. కానీ ఒకసారి బరిలోకి దిగి వెనక్కు తగ్గకూడదన్న ఏకైక కారణంతోనే వైసీపీ నేతలు ఆందోళనలు కొనసాగిస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. వైసీపీ ఏ అంశంలోనైనా దానిని తుది వరకూ తీసుకెళ్లగలమన్న నమ్మకం ఉంటేనే కొనసాగించాలని, లేకుంటే కొన్ని రోజులు ఆందోళనలు చేసి వదిలేస్తే మంచిదన్న సూచనలు కూడా వెలువడుతున్నాయి. కానీ జగన్ మాత్రం మెగా డీఎస్సీపై ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేయాల్సిందేనన్న ఆదేశాలు ఇవ్వడంతో నేతలు విధిలేని పరిస్థితుల్లో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేపట్టిన పోరాటం వల్ల రాజకీయంగా ఆ పార్టీకి పెద్దగా లాభం చేకూరకపోగా, న్యాయస్థానంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఎంపికైన అభ్యర్థులు, ప్రభుత్వం నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.న్యాయస్థానంలో ఎదురుదెబ్బలుమెగా డీఎస్సీ అక్రమాలపై వైసీపీ దాఖలు చేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది.రాజకీయ ప్రయోజనాల కోసం పిల్స్‌ను వాడరాదని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు వైసీపీ తీరుపై రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.ఇది కేవలం డైవర్షన్ రాజకీయాలంటూ అధికార కూటమి పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు.మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని ప్రభుత్వం, అభ్యర్థులు చెబుతుండటంతో, ఈ అంశంపై వైసీపీ పోరు జనంలోకి బలంగా వెళ్లడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. మొత్తం మీద ఈ పోరాటం నిష్ప్రయోజనమేనని అంటున్నారు.

## నో వర్క్ - నో పే .. జీతభత్యాల కోత పెడతారా?

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు డీఎస్సీపై అసెంబ్లీ ముట్టడిని ప్రకటిస్తామని అంటున్నారు. నిజానికి అసెంబ్లీకి గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ నేతలు క్రమం తప్పకుండా దూరంగా ఉండటం, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభకు రాబోమని తెగేసి చెప్పారు. వైఎస్సార్సీపీకి శాసనసభలో 11 మంది ఎమ్మెల్యేలు ఉండగా, జగన్ మినహా అందరూ హాజరుకాకుండానే ప్రజాధనం నుంచి జీతభత్యాలు పొందుతున్నారు. అందుకే నో వర్క్ - నో పే అనే విధానం గురించి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ చాలా సార్లు చర్చించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) ప్రకారం.. ఒక శాసనసభ సభ్యుడు సభ ముందస్తు అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటన చేసే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక సాంకేతిక అంశం ఉంది. ఈ 60 రోజుల సమయాన్ని లెక్కించేటప్పుడు, సభ వాయిదా పడిన సమయాన్ని లేదా వరుసగా 4 రోజుల కంటే ఎక్కువ రోజులు సభ లేని కాలాన్ని మినహాయిస్తారు. సాధారణంగా అసెంబ్లీ సమావేశాలు ఏడాదికి 15 నుండి 20 రోజులకు మించి జరగవు. కాబట్టి కేవలం సమావేశాలకు రాలేదనే కారణంతో రాజ్యాంగబద్ధంగా 60 రోజుల గైర్హాజరును నిరూపించి అనర్హత వేటు వేయడం కొంత సమయంతో కూడుకున్న ప్రక్రియకేవలం రాజ్యాంగంలోని 60 రోజుల నిబంధనే కాకుండా, ఏపీ శాసనసభ నిర్వహణ నిబంధనల ప్రకారం స్పీకర్‌కు విస్తృతమైన అధికారాలు ఉంటాయి. సభను , రాజ్యాంగ వ్యవస్థను అవమానించేలా "మేము అసెంబ్లీకి రాము" అని బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టి రికార్డెడ్ వ్యాఖ్యలు చేయడం, ప్రజాప్రతినిధిగా ప్రమాణం చేసి కూడా సభ పట్ల బాధ్యతారాహిత్యంగా ఉండటాన్ని సభా హక్కుల ఉల్లంఘన కింద పరిగణించే అవకాశం ఉంది. ప్రివిలేజ్ కమిటీ ద్వారా విచారణ జరిపి, నోటీసులు ఇచ్చి, నిర్ణీత గడువులోగా హాజరు కాకపోతే సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా స్పీకర్ ముందడుగు వేయవచ్చు.అనర్హత వేటు కంటే ముందు ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రధాన ఆయుధం నో వర్క్ - నో పే. సభకు హాజరు కాకుండా ప్రజాధనం నుంచి జీతాలు, భత్యాలు తీసుకోవడం నైతికంగా తప్పని ఇప్పటికే స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. ఒకవేళ సభ్యులు సభకు రాకపోతే వారి అలవెన్సులు, పెన్షన్ లేదా జీతాలను నిలిపివేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఇది పొలిటికల్ , లీగల్ చెక్-మేట్ అవుతుంది. జీతాలు ఆపేస్తే.. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించక తప్పదు, అప్పుడు సభకు ఎందుకు వెళ్లడం లేదో కోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది.వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందా లేదా అనేది పెద్ద ప్రశ్న. ఒకవేళ జగన్ సహా 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తే, ఆయా నియోజకవర్గాల్లో 6 నెలల లోపు ఉపఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. తమను అణచివేస్తున్నారని, కక్షసాధింపు చర్యలతోనే సభ్యత్వాలు రద్దు చేశారని వైసీపీ సానుభూతి పొందే ప్రమాదం ఉందనే అభిప్రాయం కూడా ఉంది. అయితే, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు ఉపఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం చేయలేరు కాబట్టి, వారిపై అనర్హత వేటు వేస్తే ఉపఎన్నికల్లో వారిని గెలిపించుకోవడానికి వైసీపీ ముప్పుతిప్పలు పడుతుందని, దాంతో వైసీపీ క్యాడర్ పూర్తిగా కుప్పకూలుతుందని మరో వ్యూహాత్మక వర్గం వాదిస్తోంది. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా గొంతు విప్పి అడగాల్సిన ఎమ్మెల్యేలు.. కేవలం హోదా దక్కలేదనే నెపంతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని జీతాల రూపంలో దండుకోవడం ఎంతవరకు సమంజసమని సోషల్ మీడియాలో అభిప్రాయం వినిపిస్తోంది. సభకు రాని పక్షంలో రాజీనామా చేసి బయటకు రావాలని, లేదా ప్రభుత్వం వెంటనే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. శాసనసభ నిబంధనలను, రాజ్యాంగ సూత్రాలను పరిశీలిస్తే.. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు స్పష్టమైన మార్గాలు ఉన్నాయి. కాకపోతే అది కేవలం చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాదు, రాజకీయ పరిణామాలకు దారితీసే అంశం. ప్రభుత్వం ముందస్తుగా నో వర్క్ - నో పే విధించి, ఆ తర్వాత నోటీసులు ఇచ్చి నిలదీసే వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**వైసీపీ వ్యూహం ఏమిటీ...**

అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారా అనే అంశం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన అనేక అసెంబ్లీ సమావేశాలకు జగన్ దూరంగా ఉన్నారు. దీంతో ఆయన సభకు ఎందుకు రావడం లేదన్న ప్రశ్న పదేపదే తెరపైకి వచ్చింది.ప్రజా సమస్యలపై చర్చించడానికి శాసనసభ కీలక వేదిక కావడంతో ప్రతిపక్ష నాయకుడు సభలో ఉండాలని అధికార, ప్రతిపక్ష వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో ప్రతిపక్ష హోదా కల్పిస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చెప్పిన విషయం కూడా రాజకీయ చర్చకు కారణమైంది. ఈ అంశంపై ఆయన న్యాయపరమైన మార్గాలను కూడా ఆశ్రయించినప్పటికీ అనుకున్న ఫలితం రాలేదని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇటీవల వైసీపీ మెగా డీఎస్సీ అంశాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వైసీపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఇదే అంశంపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడీ చర్చ జరిగే అవకాశం కూడా ఉంది.మరోవైపు జగన్ అసెంబ్లీకి గైర్హాజరయ్యే విషయంలో సభ్యుల హాజరుకు సంబంధించిన నిబంధనలు కూడా చర్చలోకి వస్తున్నాయి. ఒక ఎమ్మెల్యే వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరు కాకపోతే నిబంధనల ప్రకారం సభ్యత్వంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాబోయే సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశం ఉందన్న ప్రచారం కూడా జరుగుతోంది. 2025 ఫిబ్రవరి 24న జగన్ సభకు హాజరైనట్లు, అనంతరం 2026 ఫిబ్రవరి 11న గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లినట్లు రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఇప్పుడు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో ఆయన వ్యవహరించే తీరు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.జగన్ మరోసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే, ప్రజా సమస్యలపై చర్చించే ప్రధాన వేదికకు ఆయన దూరంగా ఉంటున్నారనే భావన ప్రజల్లో బలపడే అవకాశం ఉంది. ఇది ప్రజా తీర్పును గౌరవించడం లేదన్న అభిప్రాయానికి దారితీసి, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది.

# జమిలి ఎన్నికలపై కోవింద్ కృషి

భారత మాజీ రాష్ట్రపతి రామ్?నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. ఈ ఆత్మకథ భారత ప్రజాస్వామ్యం, సమాజానికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుంది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.



రాష్ట్రపతి పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా రామ్‌నాథ్ కోవింద్ విశ్రాంతి తీసుకోలేదని మోదీ ప్రశంసించారు. 'వన్ నేషన్- వన్ ఎలక్షన్' వంటి కీలక అంశాలపై ఆయన ఇప్పటికీ పనిచేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానంపై అవగాహన పెంచేందుకు కోవింద్ కృషి చేస్తున్నారని మోదీ అన్నారు. ఈ అంశంపై పరిష్కారం కనుగొనగలిగితే భారత ప్రజాస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. తన ఆత్మకథలో కోవింద్ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్‌తో తన అనుభవాలను కూడా వివరించారని మోదీ తెలిపారు. దేశ రాజకీయ, ప్రజాస్వామ్య ప్రయాణంలోని వివిధ కోణాలను అర్థం చేసుకోవడానికి ఇలాంటి అనుభవాలు ఉపయోగపడతాయని అన్నారు.

**'రీల్స్ కాలంలో ఆత్మకథలు చదవాలి'**

ప్రస్తుతం రీల్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం ఎక్కువగా ఉందని ప్రధాని అన్నారు. ఇలాంటి సమయంలో ప్రతిదానికీ షార్ట్‌కట్ వెతకడం సరికాదని యువతకు సూచించారు. రైల్వే స్టేషన్లలో కనిపించే 'షార్ట్‌కట్స్ విల్ కట్ యూ షార్ట్' అనే హెచ్చరికను గుర్తుచేస్తూ, జీవితంలోనూ సులభమైన దారుల కోసం వెతకడం వల్ల ఎదుగుదల పరిమితమవుతుందని యువతకు వివరించారు. ఎవరి జీవిత ప్రయాణం నచ్చినా వారి ఆత్మకథను చదవాలని కోరారు. జీవితంలో ఎదురైన సవాళ్లు, వైఫల్యాలు, విజయాల గురించి తెలుసుకోవడం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. పుస్తక పఠనం యువత ఆలోచనా విధానాన్ని విస్తృతం చేస్తుందని సూచించారు.

**కోవింద్ నిరాడంబరతకు మోదీ ప్రశంస**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నిరాడంబరత, భారతీయ సాంస్కృతిక విలువల పట్ల ఆయనకున్న గౌరవాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా తాను కోవింద్‌ను కలిసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ప్రోటోకాల్‌కు పరిమితం కాకుండా కోవింద్ తనతో ఆత్మీయంగా మాట్లాడేవారని మోదీ తెలిపారు. ప్రధానమంత్రి కారులో వెళ్లే సమయంలో ఆయన స్వయంగా కారు తలుపు వరకు వచ్చి వీడ్కోలు పలికేవారని గుర్తుచేశారు. అలా చేయవద్దని తాను పలుమార్లు చెప్పినా.. కోవింద్ తన నిరాడంబరతను మాత్రం విడిచిపెట్టలేదని అన్నారు.

# 'ప్రహార్' వ్యూహం దశలవారీ అమలు

భారతదేశపు మొట్టమొదటి సమగ్ర జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం 'ప్రహార్' వ్యూహాన్ని దశలవారీగా, ప్రగతిశీల పద్ధతిలో అమలు చేయడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి కేంద్రం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) బుధవారం పార్లమెంటుకు చెప్పింది. ఉగ్రవాద కార్యకలాపాలు, తీవ్రవాదాన్ని నిరోధించడానికి, ఎదుర్కోవడానికి ఈ వ్యూహం ప్రభుత్వ, సమాజ సమగ్ర విధానాలతో ఒక జాతీయ ఉగ్రవాద నిరోధక ఫ్రేమ్?వర్క్?ను అందిస్తుందని వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న ఆవిష్కరించిన ఈ 'ప్రహార్' వ్యూహం ఏడు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉందని కేంద్ర హోంశాఖ తెలిపింది. రాజ్యసభలో కొందరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (వీశీూ) నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. భారత పౌరులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉగ్రవాద దాడులను నివారించడం, ఎదురయ్యే ముప్పునకు తగినట్లుగా, వేగంగా ప్రతిస్పందించడం, ప్రభుత్వ యంత్రాలను సమన్వయం చేయడానికి అంతర్గత సామర్థ్యాలను పెంపొందించడం, ముప్పులను తగ్గించేందుకు మానవ హక్కులు, 'చట్టబద్ధమైన పాలన' పాటించడం, తీవ్రవాద అనుకూల పరిస్థితులను తగ్గించడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం, మొత్తం సమాజ భాగస్వామ్యం ద్వారా ఉగ్రవాద ప్రభావాల నుంచి త్వరగా కోలుకునేలా చేయడం ఉంటాయని




అందులో పేర్కొన్నారు.

"ప్రహార్ ముఖ్యంగా ఏడు మూలస్తంభాల వ్యూహంపై నిర్మించిన సమగ్రమైన, నిఘా ఆధారిత క్రియాశీలక ఫ్రేమ్?వర్క్? ద్వారా అన్ని ఉగ్రవాద నిరోధక లక్ష్యాలను పరిష్కరిస్తుంది. ఇది మల్టీ ఏజెన్సీ సెంటర్ (హీూజ) ద్వారా రియల్ టైమ్? నిఘా సమాచార భాగస్వామ్యాన్ని అధికారికం చేయడం, కీలక మౌలిక సదుపాయాలను భద్రపరచడం, రాష్ట్ర ఏజెన్సీలు/పోలీసులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (చీూ+) వంటి ప్రత్యేక కేంద్ర దళాల మధ్య వేగవంతమైన, సమన్వయంతో కూడిన కమాండ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఫలితంగా భారతదేశాన్ని ప్రతిచర్యాత్మక భద్రతా వైఖరి నుంచి క్రియాశీలక సిద్ధాంతానికి మారుస్తుంది. 'ప్రహార్' అత్యాధునిక సాంకేతికతను అనుసంధానిస్తుంది. చట్టబద్ధ పాలన, మానవ హక్కులను కచ్చితంగా సమర్థిస్తుంది. ఉగ్రవాద వ్యవస్థ నిర్మూలనకు సమాజ సహకారంతో కూడిన తీవ్రవాద నిరోధక మాడ్యూళ్లను అమలు చేస్తుంది. ఇది క్రిప్టో వాలెట్‌లను గుర్తించడం, డార్క్ వెబ్ క్రౌడ్‌సోర్సింగ్‌ను అడ్డుకోవడం, కేంద్ర ఏజెన్సీల ద్వారా ఆస్తులను జప్తు చేసి ఉగ్రవాద నిధులను కూడా అడ్డుకుంటుంది. ఈ వ్యూహం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. సరిహద్దుల గుండా జరిగే ప్రభుత్వ-ప్రాయోజిత ఉగ్రవాద నిధుల నెట్‌వర్క్‌లను అడ్డుకోవడానికి అంతర్జాతీయ ఒప్పందాలను ఉపయోగిస్తుంది. 'ప్రహార్' వ్యూహాన్ని దశలవారీగా ప్రగతిశీల పద్ధతిలో అమలు చేయడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ విధానం తక్షణ సంస్థాగత, వ్యవస్థల ఏకీకరణకు ప్రాధాన్యం ఇస్తుంది. అదే సమయంలో బహుళ అంచెల పర్యవేక్షణ యంత్రాంగాల ఫ్రేమ్?వర్క్? ద్వారా పనితీరు ఫలితాలను క్షుణ్ణంగా అంచనా వేస్తుంది."

**ఎన్‌ఐఏ ఆధ్వర్యంలో వార్షిక 'ఉగ్రవాద వ్యతిరేక సదస్సు'**

సాధారణ పర్యవేక్షణకు అదనంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఐఏ వార్షిక 'ఉగ్రవాద వ్యతిరేక సదస్సు నిర్వహించడం కూడా అటువంటి ఒక యంత్రాంగమేనని సహాయ మంత్రి నిత్యానంద రాయ్? తెలిపారు. ఇది చట్ట అమలు సంస్థలు, నిఘా సంస్థలు, భద్రతా దళాలు, విధాన రూపకర్తలు, న్యాయ నిపుణులు, ఉన్నతాధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి దేశ ఉగ్రవాద నిరోధక వ్యూహాన్ని సమీక్ష, బలోపేతానికి ఇది ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుందని మంత్రి వివరించారు.

# పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతా

పార్లమెంటులో విపక్షాల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా స్పందించారు. జులై 20న సీజేపీ ఇచ్చిన సంసద్ చలో పిలుపు సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ కార్యక్రమాలను అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన అమిత్‌షా ప్రతిపక్షాలు స్పీకర్ లేఖ రాస్తే చర్చకు సిద్ధమన్నారు. పార్లమెంటు నిబంధనల మేరకు చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. అందువల్ల సభలో చర్చ జరగాలా? లేక రచ్చ చేయాలా? అనేది ప్రతిపక్షాలే తేల్చుకోవాలని అమిత్ షా సూచించారు.

పార్లమెంట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడిన అమిత్ షా, సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను నిరంతరం పార్లమెంట్‌కు వస్తూ తన ఛాంబర్‌లోనే ఉంటున్నానని తెలిపారు. అయితే ప్రతిపక్షాలు ఉభయ సభలను సజావుగా సాగనివ్వకపోతే తాను సభలోకి వెళ్లి ఏం చేయగలనని ప్రశ్నించారు. నీట్ అంశంపై విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి విషయంపైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తుచేశారు. చర్చకు ఒక సమయం నిర్ణయించాల్సి ఉందని, అందుకు ప్రతిపక్షాలు సిద్ధపడాలని అమిత్ షా అన్నారు.

"నేను వార్తా ఛానెళ్ల ద్వారా ప్రతిపక్షాలకు తెలియజేయాలనుకుంటున్నాను. మీరు (ప్రతిపక్షాలు) మధ్యాహ్నం 2గంటల




లోపు స్పీకర్‌కు ఒక లేఖ రాసి ఇవ్వండి. మధ్యాహ్నం 3గంటల నుంచి చర్చను ప్రారంభిస్తాం. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నేను అన్ని విషయాలకు సంబంధించి సమాధానం ఇస్తాను. పార్లమెంటులో చర్చించడానికి కొన్ని నిర్దిష్టమైన నియమాలు, పద్ధతులు ఉన్నాయి. పైపైన చర్చ జరపటం సాధ్యంకాదు. బహుశా అది మీ(ప్రతిపక్షాల) పద్ధతి కావొచ్చు. కానీ పార్లమెంటరీ పద్ధతి మాత్రం అది కాదు. స్పీకర్ అనుమతిస్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా రద్దు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నేను చర్చకు సిద్ధంగా ఉన్నాను."

**దీనిపై సుదీర్ఘంగా చర్చ జరగాలి**

నీట్ పేపర్ లీక్ వంటి తీవ్రమైన అంశంపై కేవలం ఒక ప్రకటన చేయాలని కోరడం సరైన పార్లమెంటరీ విధానం కాదని అమిత్ షా అన్నారు. పార్లమెంట్‌లో ఇలాంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరగాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతిపక్షాలు స్పీకర్‌కు లేఖ ఇస్తే బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచే చర్చ ప్రారంభించేందుకు సిద్ధమని చెప్పారు. అవసరమైతే బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు చర్చ కొనసాగించవచ్చని, గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్పీకర్ అనుమతిస్తే ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా వాయిదా వేసి చర్చ కొనసాగించడానికి అభ్యంతరం లేదన్నారు. చర్చ జరిగినంతసేపు తానే స్వయంగా సభలో కూర్చుంటానని అమిత్ షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశాన్ని నమోదు చేసుకుని, వాటన్నింటికీ సమాధానాలు ఇస్తానని తెలిపారు. తద్వారా నీట్ వివాదంపై దేశ ప్రజలకు పూర్తి స్పష్టత వస్తుందని అన్నారు. "చర్చలో పాల్గొనాలా లేక సభలో గందరగోళం సృష్టించాలా అనేది ప్రతిపక్షాలే నిర్ణయించుకోవాలి" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. తీవ్రమైన అంశాలపై పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రకటన చేయాలని డిమాండ్ చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలు, నిరసనకారులపై పోలీసుల చర్యల అంశాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరుతూ ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో ఆందోళన చేస్తున్నాయి. ఈ వ్యవహారం కారణంగా పార్లమెంట్ కార్యకలాపాలకు పలుమార్లు అంతరాయం ఏర్పడింది.

## పార్లమెంటులో అమిత్ షా ఉపన్యాసాలు వినడానికి ప్రతిపక్షం సిద్ధంగా లేదు


కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్లమెంట్?లో అమిత్ షా ఇచ్చే ఉపన్యాసాలు వినడానికి ప్రతిపక్షాలు సిద్ధంగా లేవని వ్యాఖ్యానించారు. జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయమని, కాల్పులు జరపమని ఆదేశాలు ఇచ్చింది ఎవరని ప్రశ్నించారు. ఒకవేళ ఆ ఆదేశాలు ఇచ్చింది అమిత్ షానే అయితే, వెంటనే ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా హోం మంత్రి సభలో కనిపించడం లేదని, సభను ఎదుర్కొనేందుకు ఆయనకు ధైర్యం లేదని ఆరోపించారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. విద్యార్థులపై ఎవరు కాల్పులు జరిపారు మేకులు ఉన్న లాఠీలతో విద్యార్థులను కొట్టాలని ఎవరు ఆదేశించారు ఒక విద్యార్థి కంటి చూపు పోయేలా ఎవరు చేశారు విద్యార్థులపై కాల్పులు జరపమని అమిత్ షా ఆదేశించారా ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే, అందుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి. అలా చేయకపోతే, ఆయన అసమర్థుడు కాబట్టి రాజీనామా చేయాలి."

ఇదిలా ఉండగా, విద్యార్థుల ఆందోళనలు సహా అన్నిఅంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమిత్ షా ఇదివరకే తెలిపారు. సభను సాగనివ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు. ప్రతిపక్షాలు స్పీకర్ ఓంబిర్లాకు నోటీసు ఇస్తే చర్చకు సిద్ధమన్నారు. పార్లమెంటు నిబంధనల మేరకు చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. సభలో చర్చ జరగాలా? లేక రచ్చ చేయాలా? అనేది ప్రతిపక్షాలే తేల్చుకోవాలని అమిత్ షా సూచించారు.

మరోవైపు, అయోధ్య రామమందిర విరాళాల విషయంపై పార్లమెంట్?లో సమాధానం చెప్పడానికి ప్రభుత్వం నిరాకరిస్తోందని కాంగ్రెస్? ఎంపీ ప్రియాంక గాంధీ ఆరోపించారు. దాని రాష్ట్ర అంశంగా ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రామాలయం అంశాన్ని వాడుకుని బీజేపీ రాజకీయంగా లాభం పొందిందని ధ్వజమెత్తారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆమె ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామ మందిరాన్ని ప్రారంభించారు. ఆయన ఒక రాష్ట్రానికి కాదు, దేశానికి ప్రధానమంత్రి. దేశం నలుమూలల నుంచి ప్రజలు ప్రారంభోత్సవానికి వచ్చారు. ఎంతో మంది ప్రజలు [illegible]యం కోసమని చెప్పడంతో [illegible]ద ప్రజలు విరాళాలు ఇచ్చారు.

## నిరసనలు, నినాదాలతో సభ ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు'

నిరసనలు చేపట్టడం, నినాదాలు చేయడం ద్వారా లోక్‌సభ ప్రతిష్ఠను దెబ్బతీయడం సమంజసం కాదని లోక్?సభ స్పీకర్ ఓం బిర్లా హితవు పలికారు. ప్రజల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ వేదికగా ఉందని, సభ్యులు తమ అభిప్రాయాలను సభలో వ్యక్తం చేయాలని సూచించారు. ప్రతిపక్షం, అధికారపక్షం ఆలోచనలు, విధానాలు వేర్వేరుగా



ఉండొచ్చని, కానీ దేశ ప్రజలు మాత్రం పార్లమెంట్ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నారని అన్నారు. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా వారిని ఉద్దేశించి మాట్లాడారు. సభను పనిచేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సమావేశాలు ప్రారంభమైన తర్వాత స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. దీంతో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. దీంతో బుధవారం ప్రశ్నోత్తరాల సమయం మూడు నిమిషాలకంటే తక్కువ వ్యవధికే పరిమితమైంది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై ప్రశ్నించి సమాధానాలు పొందాల్సి ఉండగా, నిరసనల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రోజూ ఏదొక అంశంపై ప్రతిపక్షం, ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ప్రశ్నోత్తరాల సమయం పూర్తిస్థాయిలో కొనసాగలేదు. ఇలా జరగడం ఇది 18వ రోజు.

## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిశీలించారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై 20వేల పేజీలతో



ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టం, 2024 కింద నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. 360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. అయితే, ఈ కేసులో సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టులో ఇంకా చెప్పనివి, ప్రస్తుతం ఛార్జిషీటులో భాగంగా ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమని కోర్టు పేర్కొంది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచించింది.

**పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు**

ఇదిలా ఉండగా, పేపర్ లీక్ వ్యవహారంపై ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టడానికి, అలాగే లీకేజీ బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా చూసేందుకు ఈ ఫాస్ట్?ట్రాక్? కోర్టులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణలో జాప్యం జరగకుండా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, 2 నుంచి 3 నెలల లోపే కేసుకు సంబంధించిన తీర్పులు ఇచ్చేలా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'కు కూడా ఇటీవల లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త సవరణలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఈ కేసులో దోషులుగా నిర్ధరణ అయితే, గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, రూ.10కోట్ల వరకు భారీ జరిమానా విధిస్తారు.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్స్**

ఇక, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లాగే, ప్రత్యేక టాస్క్? ఫోర్స్?ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కేంద్ర ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటించారు. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక టాస్క్?ఫోర్స్? కోసం ఏర్పాటు చేసిన కమిటీ, ప్రధానంగా పరీక్షల సంస్కరణలపై దృష్టి సారిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీలో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ దేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

## త్వరలోనే జంతర్ మంతర్ సీజన్- 2 ప్రారంభం

**సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే**

విద్యార్థుల నిరసన తరహాలోనే మరో నిరసన కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆయన 'జంతర్ మంతర్ సీజన్- 2'గా అభివర్ణించారు. ఢిల్లీలో తమ వాలంటీర్ల సమావేశం కోసం వేదికను వెతకడంలో సీజేపీ ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెప్పి తమకు వేదికను ఇచ్చేందుకు నిరాకరించారని ఆరోపించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ హస్తం ఉందని విమర్శించారు. ఇటువంటి చర్యలు సీజేపీని ఏమాత్రం భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన బహిరంగ సమావేశంలో ఈ మేరకు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. "'జంతర్ మంతర్ సీజన్- 2' ఎప్పుడు మొదలవుతుందని చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుతున్నారు. వారికి నేను చెప్పేది ఒక్కటే- 'జంతర్ మంతర్ సీజన్- 2' చాలా త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఈ రోజు ఢిల్లీలో మా వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్నాం. దాని కోసం హాల్ వెతికినా ఎవరూ అద్దెకు ఇవ్వలేదు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారు. చివరికి ఒక హాల్ దొరికింది. అయితే ఆ యజమానికి ఈ రోజు ఉదయం బెదిరింపులు వచ్చాయి. సీజేపీ సమావేశాన్ని ఇక్కడ జరగనిస్తే వారిని (హాల్ యజమానులను) తలకిందులుగా వేలాడదీస్తామని బెదిరించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ ఉంది. ఇదంతా బీజేపీయే చేస్తోంది. దేశంలోని యువతను చూసి కమలం పార్టీ భయపడుతోంది. ఆ పార్టీ నేతల మాటలు, చేతలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి చర్యలతో మమ్మల్ని భయపెట్టవచ్చని వారు అనుకుంటే అది పొరపాటే. ఇటువంటి చర్యలకు మేం అస్సలు భయపడం. "

**బీజేపీపై ఫైర్**

కమలం పార్టీపై ఢిల్లీ వేదికగా సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి ఘాటు విమర్శలు చేశారు. తాము పాఠశాలల బాగు గురించి మాట్లాడుతున్నందున గందరగోళం సృష్టించడానికి బయటి వ్యక్తులను ఇక్కడికి పంపారని ఆరోపించారు. బీజేపీకి విద్య విషయంలోనే సమస్య ఉందని మండిపడ్డారు. అసలు సీజేపీ సమావేశం వద్ద గందరగోళం సృష్టించడానికి వచ్చిన వ్యక్తి ఎవరో తమకు తెలియదన్నారు.

గత ఏడాది అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ, గాజాపై ఇజ్రాయెల్ దాడులకు, విధ్వంసానికి ముగింపని ప్రపంచం ఆశించింది. కానీ వాస్తవం పూర్తి భిన్నం. కాల్పుల విరమణ అమలు నుంచి ఇప్పటికే దాదాపు 1,300 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో అంతమొందారు. గాజా పట్టీలో దాదాపు 70 శాతం మట్టి ఇప్పటికీ ఇజ్రాయెల్ నియంత్రణలోనే ఉంది. రెండు మిలియన్ల జనాభాలో అత్యధికులు శిబిరాల్లో బతుకీడుస్తున్నారు. పాఠశాలలు, ఆసుపత్రులు మూతపడ్డాయి. సాయం పరిమితమైంది, పునర్నిర్మాణాన్ని ఇజ్రాయెల్ తుణీకరిస్తూనే ఉంది. ముందుగా హమాస్ నిరాయుధీకరణ జరగాలన్నది దాని పట్టుదల. అయితే, హమాస్.. దశలవారీగా ఆయుధాలు అప్పగించి, పాలస్తీనా సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి, ఇజ్రాయెల్ క్రమంగా వైదొలిగేలా ట్రంప్ నేతృత్వంలోని 'బోర్డ్ ఆఫ్ పీస్' ప్రతిపాదించిన 15-అంశాల ప్రణాళికను అంగీకరించినా.. -ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ పూర్తిగా తిరస్కరించారు. ఆగస్టు 9న జరిగిన కేబినెట్ సమావేశంలో "ఇజ్రాయెల్ 15 అంశాల పత్రాన్ని తిరస్కరిస్తోంది" అని స్పష్టం చేసిన నెతన్యాహూ, హమాస్ "భారీ ఆయుధాలు, తేలికపాటి ఆయుధాలు, మొత్తం అన్ని ఆయుధాలను" వదులుకునే వరకూ ఉపసంహరణ ఉండదని తేల్చిచెప్పారు. అమెరికాతో ఈ అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని, అమెరికా సూచనల్లో కొన్ని తమకు ఆమోదయోగ్యమైనవి, కొన్ని కావని పేర్కొంటూ, "అత్యంత సన్నిహిత మిత్రుల ముందు కూడా అవసరమైతే మేం మా వైఖరిపై స్థిరంగా నిలబడగలం" అని స్పష్టం చేశారు. హమాస్ నిరాయుధీకరణ, గాజా సంపూర్ణ స్వాధీనమే ఇజ్రాయెల్ అసలు లక్ష్యం. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకూ 73,300కు పైగా పాలస్తీనియన్లు మరణించడం.. గాజా దారుణ దుస్థితిని స్పష్టం చేస్తోంది.

అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో దక్షిణాఫ్రికా దాఖలు చేసిన మారణహోమం కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. బ్రెజిల్, ఐర్లాండ్, టర్కీ, స్పెయిన్, మెక్సికో సహా పలు దేశాలు ఈ కేసుకు మద్దతుగా చేరాయి. ఇజ్రాయెల్ న్యాయవాద బృందాలు పదేపదే విచారణను వాయిదా వేయించడంలో సఫలమయ్యాయి. వచ్చే ఏడాది వరకు మరో వాయిదా పడే అవకాశముంది. ఇక అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) 2024 నవంబర్‌లోనే నెతన్యాహూతోపాటు మాజీ రక్షణ మంత్రి యోవ్ గలాంట్‌పై యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాల ఆరోపణలతో అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ వారెంటు ప్రకారం, ఐసీసీలో సభ్యదేశాలైన 124 దేశాల్లో దేనిలో అడుగుపెట్టినా నెతన్యాహూను అరెస్టు చేయాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుంది. టర్కీ సైతం స్వతంత్రంగా నెతన్యాహూతోపాటు 37మంది ఇజ్రాయెల్ అధికారులపై మారణహోమం ఆరోపణలతో అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఇంతటి తీవ్రమైన అంతర్జాతీయ న్యాయపరమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నా, దేశీయంగా అవినీతి కేసులో కూడా నెతన్యాహూ విచారణను ఎదుర్కొంటున్నారు. హమాస్‌ను సంపూర్ణంగా నిర్మూలిస్తానని హామీ ఇస్తూ, జాతీయవాద మితవాద వర్గాల మద్దతుతో అధికారంలో కొనసాగాలన్నదే ఆయన వ్యూహం. అక్టోబర్ 27న జరగనున్న ఎన్నికల్లో తన సంకీర్ణ ప్రభుత్వం మెజారిటీ కోల్పోయే ప్రమాదముందని సర్వేలు చెబుతున్న తరుణంలో,

## దుర్భర గాజా..!

ఉపసంహరణపై ఏ చిన్న రాయితీ ఇచ్చినా రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నెతన్యాహూ భావిస్తున్నారు. అందుకే "నేను ప్రధానిగా ఉన్నంతకాలం, గాజాలోగానీ వెస్ట్‌బ్యాంక్‌లో గానీ పాలస్తీనా రాజ్యం ఏర్పడదు" అని ఆయన మరోసారి కరాఖండీగా స్పష్టం చేశారు. మరోవైపు, హమాస్‌వైపు నుంచి చూస్తే, తన వద్ద మిగిలిన సాధనాలు తక్కువగా ఉన్న తరుణంలో నిరాయుధీకరణ అనివార్యమే అయినా, దానికి ఇజ్రాయెల్ సంపూర్ణ ఉపసంహరణ, హింసాకాండ నిలిపివేత సమాంతరంగా జరగాలన్నది దాని డిమాండ్. భారీ ఆయుధాలను వదులుకోవడం ప్రక్రియలో తర్వాతి దశలో మాత్రమే జరుగుతుందని, అది కూడా పాలస్తీనా రాజ్య స్థాపనకు హామీ లభిస్తేనే సాధ్యమని హమాస్ షరతు విధించింది. అయితే, బోర్డ్ ఆఫ్ పీస్ ఇప్పటికే నెతన్యాహూ వాదననే సమర్థిస్తూ, హమాస్ ఆయుధాలు పూర్తిగా నిర్వీర్యమైన తర్వాతే ఇజ్రాయెల్ 'ఎల్లో లైన్' దాటి వైదొలుగుతుందని ఆగస్టు 3న ప్రకటించడం గమనార్హం. దీంతో మధ్యవర్తులు నెలల తరబడి కష్టపడి రూపొందించిన ఈ శాంతి ప్రణాళిక మళ్లీ ప్రతిష్టంభనలో పడింది.

## సంపాదకీయం

ఫిబ్రవరి 28న ట్రంప్, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు లక్ష్యంగా ప్రారంభించిన యుద్ధం ఒక విపత్తుగా మారి, పలు దేశాలను ప్రభావితం చేసిన ఇంధన సంక్షోభానికి దారితీసింది. హర్మూజ్ జలసంధి దాదాపు స్తంభించిపోవడంతో, అమెరికాలో పెట్రోల్, ఎరువుల ధరలు పెరిగి, స్వదేశీ ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపడం మొదలైంది. దీంతో పశ్చిమాసియాలో ఏదోక ముఖరక్షణ పరిష్కారాన్ని కనుగొనాలని ట్రంప్ ఆరాటపడుతున్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్‌పై సానుభూతి క్రమంగా తగ్గుతుండటం కూడా బోర్డ్ ఆఫ్ పీస్ ప్రతిపాదన వెనుక ఉన్న మరో కారణం. అయితే, పాలస్తీనియన్లకు ప్రాతినిధ్యం లేని బోర్డు, ప్రైవేటీకరించిన మౌలిక సదుపాయాలు, స్వేచ్ఛా వాణిజ్య మండలిగా 'కొత్త గాజా' రూపొందించాలన్న హాస్యాస్పదమైన దార్శనికత -ఇవి యుద్ధానంతర పచ్చి లాభార్జన ప్రయత్నంలా కనిపిస్తున్నా, ఈ 15-అంశాల ప్రతిపాదననే గాజాలో నలిగిపోతున్న ప్రజలు స్వాగతించే అవకాశం ఉంది. హిల్లరీ క్లింటన్ వంటి డెమోక్రాటిక్ నేతలు సైతం విమర్శకుల నుంచి విడిపోయి, ఈ ప్రణాళికను "ఇప్పుడున్న ఏకైక మార్గం"గా అభివర్ణించడం గమనార్హం. హమాస్ వద్ద చర్చల్లో బేరమాడేందుకు మిగిలింది తక్కువే అయినందున, నిరాయుధీకరణ దానికి తప్పనిసరి అవసరం. కానీ దానికి ప్రతిగా ఇజ్రాయెల్ ఉపసంహరణ కూడా జరగాలన్న న్యాయమైన డిమాండ్‌ను విస్మరించలేం. ఇజ్రాయెల్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా తనకున్న పలుకుబడిని ఉపయోగించి, నిజమైన ఉపసంహరణను సాధించడానికి అమెరికా ప్రయత్నించొచ్చు. కానీ నెతన్యాహూ రాజకీయ మనుగడ కోసం ఆయన అనుసరిస్తున్న వ్యూహం, రెండేళ్లుగా న్యాయస్థానాల విచారణలను ఏదోవిధంగా వాయిదా వేయిస్తూ కాలయాపన చేస్తున్న ధోరణి చూస్తుంటే, గాజా ప్రజలకు నిజమైన శాంతి ఇప్పట్లో దక్కే అవకాశం కనిపించడం లేదు. అంతర్జాతీయ సమాజం మాటలకే పరిమితం కాకుండా, నిర్దిష్ట చర్యలు తీసుకోకపోతే, ఈ మారణహోమం మరింత సుదీర్ఘంగా కొనసాగే ప్రమాదం ఉంది.

### పనికొచ్చే పలుకు




## మలుపే కదా.. మనసైన జీవితం

***Comparison is the thief of joy.***

ఇది థియోడర్ రూజ్‌వెల్ట్ మాట. సింపుల్‌గా చెప్పాలంటే.. 'పోలిక అనేది ఆనందాన్ని దొంగిలించే దొంగ' అని! పుట్టినప్పటి నుంచి చనిపోయేదాకా జీవితం ఒక సరళరేఖలా సాగుతుందని మనం చిన్నప్పటి నుంచే ఒక భ్రమలో పెరుగుతాం. బడిలో చేరడం, పరీక్షలు రాయడం, డిగ్రీ పొందడం, ఉద్యోగం సంపాదించడం, పెళ్లి చేసుకోవడం, స్థిరపడడం -ఈ క్రమాన్ని సమాజం మనకు ఒక 'విజయ సూత్రం'లా బోధిస్తుంది. ఈ క్రమంలో ఏ ఒక్క మెట్టు తడబడినా, ఏ ఒక్క అడుగు ఆలస్యమైనా, జీవితం విఫలమైనట్టు భావించే ధోరణి మనలో పాతుకుపోతుంది. కానీ నిజం చెప్పాలంటే, ఈ ప్రపంచంలో ఏ ఒక్క గొప్ప విజయగాథ కూడా ఇలా సూటిగా, నిటారుగా సాగిన దాఖలా లేదు.

ప్రకృతిని గమనించండి. -నదులు ఎప్పుడూ సూటిగా ప్రవహించవు. కొండలు, రాళ్లు, లోయలను చుట్టుకుంటూ, వంపులు తిరుగుతూ, కొన్నిచోట్ల వేగంగా, మరికొన్నిచోట్ల నెమ్మదిగా సాగుతూ చివరికి సముద్రంలో కలుస్తాయి. మనిషి జీవితం కూడా అంతే. కొందరు 20 ఏళ్లకే విజయం సాధిస్తే, మరికొందరికి 40 ఏళ్లు పడుతుంది. కొందరు మొదటి ప్రయత్నంలోనే గెలుస్తే, మరికొందరు పదిసార్లు ఓడి పదకొండోసారి నిలబడతారు. ఒకరి వేగాన్ని, ఒకరి బాటను మరొకరితో పోల్చడం అన్యాయమే కాదు, అనవసరమైన మానసిక క్షోభ కూడా. సామాజిక మాధ్యమాల యుగంలో మనం ప్రతిక్షణం ఇతరుల విజయాలను చూస్తూ, మన సొంత ప్రయాణాన్ని తక్కువ చేసి చూసుకునే ప్రమాదంలో పడుతున్నాం. స్నేహితుడు త్వరగా ఉద్యోగం సంపాదిస్తే, తోబుట్టువు ముందుగా పెళ్లి చేసుకుంటే, సహోద్యోగి వేగంగా పదోన్నతి పొందితే -వీటన్నింటినీ చూసి మనం వెనుకబడిపోయామనే భావనలో కుంగిపోతాం. కానీ ఇది తప్పుడు కొలమానం. ప్రతి మనిషి జీవితం ఒక ప్రత్యేకమైన అధ్యాయం. దాన్ని మరొకరి అధ్యాయంతో పోల్చి చదవలేం.


"వంకరైనా గమ్యం ఒక్కటే" అని పెద్దలు చెప్పే మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి. నది ఎన్ని మలుపులు తిరిగినా చివరికి సముద్రాన్నే చేరుతుంది. అలాగే, మన జీవిత మార్గం ఎన్ని మలుపులు తిరిగినా, ఎంత ఆలస్యమైనా, మనం చేరాల్సిన గమ్యాన్ని చేరుకోగలం. ఒక్క షరతుతో, మన ప్రయాణాన్ని మధ్యలో వదిలేయకుండా ఉంటే చాలు. ఈ ఆలోచననే పాశ్చాత్య రచయిత రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ ఇలా చెప్పాడు: *Do not go where the path may lead, go instead where there is no path and leave a trail.* అంటే, ఇతరులు వేసిన బాటలో నడవడంకంటే, మీ సొంత బాటను మీరే సృష్టించుకోవడంలోనే నిజమైన సాఫల్యం ఉంటుంది.

కాబట్టి, రేపటి నుంచి ఇతరుల జీవిత వేగంతో మీ జీవితాన్ని కొలవడం మానేయండి. మీ మలుపులను, ఆలస్యాలను, తడబాట్లను వైఫల్యాలుగా కాకుండా, మీ ప్రత్యేకమైన ప్రయాణంలో భాగంగా స్వీకరించండి. ప్రతి ఆలస్యం వెనుక ఒక పాఠం ఉంటుంది. ప్రతి మలుపు వెనుక ఒక కొత్త అవకాశం దాగి ఉంటుంది. మీ వేగం మీది, మీ దారి మీది. -దాన్ని గౌరవించడం నేర్చుకోండి. అప్పుడే నిజమైన మనశ్శాంతి, నిజమైన విజయం మీ సొంతమవుతాయి.

మీ ప్రయాణం ఎంత వంకరైనా, ఎంత ఆలస్యమైనా -అది మీదే. అందులోనే మీ అసలైన అందం దాగుంది. ఇతరుల వేగంతో పరుగెత్తడం మానేసి, మీ లయలో మీరు నడవండి. మిమ్మల్ని వెతుక్కుంటూ గమ్యం అదే మీవైపు వస్తుంది.

# ఇదీ.. నవ నగర జవసత్వం!

**రాజధాని అమరావతి నిర్మాణంలో ఆగస్టు 13న చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ, స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ టవర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. విజయవాడ నుంచి రాజధానికి నిరంతరాయ అనుసంధానం కల్పించే ఈ 21.77 కిలోమీటర్ల రహదారి, ఇరుకైన కరకట్ట రోడ్డుపై ఆధారపడిన వేలాది మందికి శాశ్వత ఊరట కల్పించనుంది. మౌలిక వసతులతోపాటు, పర్యాటక కేంద్రంగానూ ఈ కారిడార్‌ను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2050 నాటికి 35 బిలియన్ డాలర్ల జీడీపీ, 35 లక్షల జనాభాతో ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలన్న అమరావతి కలకు ఈ రహదారి పునాదిగా నిలవనుంది.**




రాజధాని అమరావతి నిర్మాణంలో ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ, స్టీల్ బ్రిడ్జిలు, ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ టవర్లను సీఎం చంద్రబాబు నేడు (ఆగస్టు 13న) ప్రారంభిస్తున్నారు. ఇది -రాజధాని నగర నిర్మాణ ప్రస్థానానికి కీలక మలుపు కానుంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని కొత్త రాజధానిగా ప్రకటించినప్పటి నుంచి, ఈ ప్రాజెక్టు అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. బ్రిటన్‌కు చెందిన ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ రూపొందించిన అమరావతి మాస్టర్ ప్లాన్ ప్రకారం, 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విజయవాడ-గుంటూరు నగరాల మధ్య నగరాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, 2019-2024 మధ్య కాలంలో వైసీపీ మూడు రాజధానుల ప్రతిపాదనతో ప్రాజెక్టు నిర్మాణం స్తంభించింది. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం రూ.65 వేల కోట్లతో పునర్నిర్మాణ పనులు వేగవంతం చేసింది. -ఏప్రిల్ 2న ఏపీకి ఏకైక అధికారిక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం కీలక పరిణామం. ప్రస్తుతం అమరావతి పరిధిలో రూ.57,821 కోట్ల విలువైన నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రజా రాజధానికి జవసత్వాన్నిచ్చే సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేయడం.. అమరావతి నిర్మాణంలో సర్కారు చూపుతున్న చిత్తశుద్ధి, వేగానికి నిదర్శనంగా కాకపోదు!

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం వెనుక ఉన్న అసలైన ఉద్దేశం -రాజధాని నగరానికి, పరిసర ప్రాంతాలకు నిరంతరాయ, వేగవంతమైన అనుసంధానత కల్పించడం. ప్రస్తుతం విజయవాడ నుంచి అమరావతి సచివాలయం, హైకోర్టుకు వెళ్లే వేలాది మంది ఇరుకైన కరకట్ట రహదారిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ ఆంక్షలు, రద్దీ కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్టే. మొత్తం 21.77 కిలోమీటర్ల పొడవైన రహదారి, రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన 'ఎన్' సిరీస్ రోడ్లను అనుసంధానించే వెన్నెముక.

దొండపాడు నుంచి మొదలై రాయపూడి, వేంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా సాగి, మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి-16లో కలుస్తుంది. తొలి రెండు దశల్లో 9 లైన్ల రహదారిగా, మధ్యలో ప్రత్యేక బీఆర్‌టీఎస్ కారిడార్‌తో దీన్ని నిర్మించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ, భూగర్భ మంచినీటి పైప్‌లైన్లు, గ్యాస్ నెట్‌వర్క్, విద్యుత్ లైన్లు, సివరేజ్ వ్యవస్థ, ఐసీటీ కేబుళ్లతోపాటు ప్రత్యేక సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌వేలను ఏర్పాటు చేశారు. ఇది వాహనాల రాకపోకలకే కాకుండా, భవిష్యత్తులో నగర విస్తరణకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్న దూరదృష్టిని ప్రతిబింబిస్తుంది. అదే రోజు ప్రారంభమయ్యే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లలో మొత్తం 207 అత్యాధునిక ఫ్లాట్లను ప్రజాప్రతినిధులకు అందించడం ద్వారా, పరిపాలనా వ్యవస్థను రాజధానిలోకి పూర్తిస్థాయిలో తరలించే ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఈనెల 17నుంచి ప్రారంభమయ్యే శాసనసభ వర్షాకాల సమావేశాల నాటికి ఈ ఫ్లాట్ల కేటాయింపు జరిగే అవకాశం ఉండటం, రాజధానిలో పరిపాలన కేంద్రీకృతం కావడానికి మరో అడుగు ముందుకు పడినట్టే!

ఈ ప్రాజెక్టు వెనుక ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యతలను నిశితంగా పరిశీలిస్తే, కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాకుండా, ఆర్థిక, పర్యాటక కోణాల్లోనూ విస్తృత లక్ష్యాలు కనిపిస్తాయి. ఆమ్‌స్టర్‌డామ్, సింగపూర్, టోక్యోవంటి అంతర్జాతీయ నగరాల స్ఫూర్తితో అమరావతిని ప్రపంచస్థాయి, సమ్మిళిత, ఆధునిక పట్టణ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2050నాటికి ఈ నగరం 35 బిలియన్ డాలర్ల జీడీపీతో, 35 లక్షలమందికి నివాసంగా, 15 లక్షల ఉద్యోగాలను సృష్టించే ఆర్థిక కేంద్రంగా ఎదగాలని అంచనా వేస్తున్నారు. ఈ బృహత్తర లక్ష్యాన్ని సాధించాలంటే, ముందుగా పటిష్టమైన అనుసంధాన వ్యవస్థ ఏర్పడాలి. అందుకే సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఇంత ప్రాధాన్యం. ఈ కారిడార్ వెంబడి ఉండవల్లి, పెనుమాక, మందడం వంటి ప్రాంతాల్లో భూముల విలువ గణనీయంగా పెరగనుంది. ఐటీ కంపెనీలు, వాణిజ్య సముదాయాలు ఇక్కడ కేంద్రీకృతమయ్యే ఛాన్స్ ఉంది. కేవలం మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగానూ తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ప్రభుత్వం అడుగులేస్తోంది. కృష్ణా నది, కొండవీటి వాగు అందాల ఆస్వాదనకు ప్రత్యేక వ్యూ పాయింట్లు, పర్యావరణహిత సైక్లింగ్-వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేయడం ఇందులో భాగమే. ప్రపంచ ప్రఖ్యాత బకింగ్‌హామ్ కెనాల్‌పై 110 మీటర్ల పొడవుతో, కొండవీటి వాగుపై 280 మీటర్ల పొడవుతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలు, రాజధానికి కొత్త గేట్‌వే. వరద ముప్పు రక్షణ ఏర్పాట్లూ ఇందులోనే పొందుపర్చారు. ఇక మూడో దశలో ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మించనున్న 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పూర్తయితే, ఈ రహదారి ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌గా జాతీయ రహదారి-16తో నేరుగా అనుసంధానమవుతుంది. సో, సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవం రహదారి ప్రారంభమే కాదు -రాజధాని నగరం భవిష్యత్తు వైపు వేస్తున్న దృఢమైన అడుగు. మౌలిక సదుపాయాల కల్పనలో వేగం, పరిపాలనా వికేంద్రీకరణలో స్పష్టత, ఆర్థికాభివృద్ధిలో దూరదృష్టి -ఈ మూడింటినీ మేళవించి, అమరావతిని నిజమైన అర్థంలో ప్రజల రాజధానిగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ ప్రాజెక్టు నిలువెత్తు నిదర్శనం! ■



పిల్లాడి కేరింతలు మొదలైన క్షణం నుంచి, మన జీవితం కూడా కొత్త లయలో నడవాలి. అంతేగానీ ఆగిపోకూడదు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలు పుట్టిన తర్వాత బయటకు వెళ్లడం, వ్యాయామం చేయడం, తమ కోసం సమయం కేటాయించడం లాంటివి పూర్తిగా వదిలేస్తుంటారు. ఇది పిల్లల వల్ల వచ్చే సమస్య కాదు. పెరిగిన బాధ్యతలకు తగ్గట్టుగా మన ఓర్పు, సమయ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోకపోవడం వల్ల వచ్చే ఇబ్బంది మాత్రమే. చిన్న చిన్న ప్రణాళికలతో మీ సామర్థ్యాన్ని పెంచుకుంటే, పిల్లలతో కలిసి మరింత ప్రశాంతంగా, పరిపూర్ణంగా జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## అర టన్ను తీపి కల!



స్పెయిన్‌కు చెందిన ప్రముఖ పేస్ట్రీ చెఫ్ మార్క్ సువారెజ్ ఇటీవల సృష్టించిన వెడ్డింగ్ కేక్ చూసి అందరూ నోరెళ్లబెట్టారు. 3.5 మీటర్ల ఎత్తు, 1.8 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ కళాఖండం, కేక్‌లాకాకుండా మ్యూజియంలో ఉంచే శిల్పంలా కనిపిస్తుంది. సౌదీ రాజ కుటుంబం నిర్వహించిన ఒక వివాహం కోసం దీన్ని ప్రత్యేకంగా తయారుచేశారు. కాన్సెప్ట్ రూపొందించడానికే ఒకటిన్నర నెలపట్టగా, పూర్తి చేయడానికి నాలుగు నెలలు, మొత్తం 1,800 గంటలు శ్రమించారు. సాధారణంగా ఒంటరిగా పనిచేసే సువారెజ్, ఈసారి పని భారీగా ఉండటంతో స్నేహితులు, వారి కుటుంబాలను సైతం రంగంలోకి దించారు. 33,000 చక్కెర రేకులను తయారుచేసి, రంగులు వేసి, కొమ్మలు, పూలతో అమర్చడమే పెద్ద సవాలైంది. చివరికి ఈ కేక్ బరువు ఏకంగా 500 కిలోలకు చేరింది. విశేషం ఏమిటంటే, ఇందులో కేవలం 0.1 శాతమే అసలైన కేక్, మిగతాదంతా చేతితో మలిచిన షుగర్ పేస్ట్, వైట్ చాక్లెట్టే! పారిస్ ఒపేరా గార్నియర్‌లో జరిగిన ఈ వేడుకలో ఈ కేక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

## ఇకనైనా కుల్‌దీప్ యాదవ్‌కు అవకాశాలివ్వండి: భారత మాజీ స్పిన్నర్



: రవీంద్ర జడేజా కెరీర్ చరమాంకంలో ఉండటంతో కుల్‌దీప్ యాదవ్‌కు టెస్టు జట్టులో మరిన్ని అవకాశాలు ఇవ్వాలని టీమ్ఇండియా మేనేజ్‌మెంట్‌కు భారత మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ ) సూచించాడు. కుల్‌దీప్ మ్యాచ్ విన్నర్ అని.. అతడి నుంచి రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్ అన్ని ఫార్మాట్లలో మంచి ఫలితాలు రాబట్టారని మాజీ స్పిన్నర్ అన్నాడు. ప్రస్తుతం కుల్‌దీప్ ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో మొదలుకానున్న రెండు టెస్టుల సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు.

"డబ్ల్యూటీసీ దృష్ట్యా టెస్ట్ క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకుంటే ఈ సిరీస్ చాలా కీలకం. ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో ఉంది. ఇటీవలి కాలంలో టెస్టుల్లో టీమ్ఇండియా ప్రదర్శన అంత గొప్పగా లేదు. ఈ విషయం అందరికీ తెలిసిందే. ఈ సిరీస్ స్పిన్నర్లకు పరీక్షగా నిలవనుంది. భారత క్రికెట్‌కు ఎంతో సేవ చేసిన జడేజా ప్రస్తుతం తన కెరీర్ చివరి దశలో ఉన్నాడు. ఇప్పుడు కుల్‌దీప్ యాదవ్ ను జాగ్రత్తగా కాపాడుకోవాలి.

జట్టుకు ఎంపిక అవుతున్నా తుది జట్టులో అవకాశం దక్కడం లేదు. ఇంగ్లాండ్ పర్యటనలో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించకుండా బెంచ్‌కే పరిమితం చేశారు. రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్ అతనికి మద్దతుగా నిలిచి మంచి ఫలితాలు రాబట్టేవారు. ఇప్పుడు కుల్‌దీప్ యాదవ్‌కు అవకాశాలు రావడం లేదు. ఇకనైనా అతడికి అవకాశాలు ఇస్తూ ఆత్మవిశ్వాసం కలిగించాలి" అని మురళీ కార్తిక్ పేర్కొన్నాడు. గంభీర్ హెడ్ కోచ్‌గా నియమితుడైనప్పటి నుంచి భారత్ 19 టెస్టులు ఆడగా.. కుల్‌దీప్ కేవలం ఆరు టెస్టులు మాత్రమే ఆడాడు.

# అమ్మాయిలకు ఉందా అవకాశం

## మహిళల హాకీ ప్రపంచకప్ మరో 2 రోజుల్లో



హాకీలో భారత పురుషుల జట్టుతో పోలిస్తే మహిళల జట్టు బలహీనమే. కానీ జట్టు చరిత్రలో కొన్ని మెరుపులు లేకపోలేదు. 2020 ఒలింపిక్స్‌లో నాలుగో స్థానం సాధించడమే ఇందుకు నిదర్శనం. కఠినమైన పోటీ ఉండే ప్రపంచకప్‌లోనూ భారత్ ఒకసారి (1974) సెమీఫైనల్ చేరింది. తర్వాత నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన లేదు. శనివారం ఆరంభం కాబోతున్న ఈసారి టోర్నీలో సలీమా టెటె సారథ్యంలో బరిలో దిగుతున్న భారత మహిళల జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరం.

**తొలి టోర్నీలో అదరగొట్టి..**

1974 ప్రపంచకప్ హాకీ తొలి టోర్నీలోనే భారత్ అదిరే ప్రదర్శన చేసింది. అజందర్ కౌర్ సారథ్యంలోని జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లి ట్రోఫీపై ఆశలు రేపింది. అయితే సెమీస్‌లో ఓడి..నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఆపై చాన్నాళ్ల తర్వాత 2018లో రాణి రాంపాల్ కెప్టెన్సీలో క్వార్టర్స్ వరకు వెళ్లడం భారత్‌కు ఉత్తమ ప్రదర్శనల్లో ఒకటి. క్వార్టర్స్‌లో పెనాల్టీ షూటౌట్లో ఐర్లాండ్ చేతిలో ఓడింది. గత అయిదు టోర్నీల్లో ఇదే భారత్‌కు ఉత్తమ ప్రదర్శన. చివరగా 2022 టోర్నీలో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది.

**రాణినే టాప్**

భారత్ తరఫున ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ రికార్డు రాణి రాంపాల్ పేరిట ఉంది. ఆమె రెండు ప్రపంచకప్పుల్లో 8 గోల్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2010 కప్‌లో 15 ఏళ్ల వయసులో బరిలో దిగిన ఆమె 7 గోల్స్ కొట్టింది. 2018లో ఒక గోల్ సాధించింది. రాణి తర్వాత సురీందర్ కౌర్ రెండో స్థానంలో ఉంది. సురీందర్ కౌర్ 2006 టోర్నీలో 5 గోల్స్ సాధించింది.

**ఆ పదకొండు మంది**

ప్రస్తుత భారత జట్టులో ఉన్న లాల్‌తాన్‌త్లువాంగి, శిల్పా దబాస్, ఇషిక చౌదరి, సాక్షి రాణా, సునెలిటా టొప్పో, దీపిక సొరెంగ్, దీపిక, రుతుజ, ఇషిక, బల్జీత్ కౌర్, బ్యూటీలకు ప్రపంచకప్‌లో ఆడడం ఇదే తొలిసారి. సాక్షి (18 ఏళ్లు), సునెలిటా (19) టీనేజర్లు. లాల్‌తాన్‌త్లువాంగి (20), దీపిక సొరెంగ్ (22), రుతుజ (23), దీపిక (22), సలీమా టెట్ (24), బ్యూటీ (23).. 25 ఏళ్ల లోపు ఉన్నారు.

**313 మ్యాచ్‌ల్లో..**

గోల్ కీపర్ సవిత ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌లు 313. జట్టులో అత్యంత అనుభవజ్ఞురాలు సవితనే. సవితతో పాటు నవ్‌నీత్ కౌర్, నికీ ప్రధాన్, నేహా, లాల్‌రెమ్‌సియామిలకు అత్యధికంగా 3 ప్రపంచకప్‌లు ఆడిన అనుభవం ఉంది. జట్టులో శిల్పి, లాల్‌తాన్‌త్లువాంగిలకు మాత్రమే తక్కువ అనుభవం (5 మ్యాచ్‌లు) ఉంది.

కఠినమైన గ్రూప్: ప్రపంచకప్‌లో భారత్ కఠినమైన గ్రూప్‌లో పడింది. గ్రూప్–డిలో చైనా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాను సలీమా బృందం ఢీకొనబోతోంది. ఈ మూడు జట్లపై మెరుగైన ప్రదర్శన చేసి ముందంజ వేయడం భారత్‌కు పెద్ద సవాల్.

'ఇస్మార్ట్' బ్యూటీ నాభా నటేష్: కెరీర్ విశేషాలు ఢ రాబోయే చిత్రాలు



# చిక్ కేఫే స్టైల్‌లో పూజా హెగ్డే గ్లామర్ షో.. యెల్లో డ్రెస్ హైలైట్!



బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. విదేశీ వీధుల్లో, ఒక వినూత్నమైన కేఫే బ్యాక్‌డ్రాప్‌లో దిగిన ఆమె లేటెస్ట్ ఫొటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. పసుపు రంగు బాడీకాన్ డ్రెస్‌లో తన స్టైలిష్ లుక్స్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ షేర్ చేసిన ఈ గ్లామరస్ పిక్స్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.

**బుడాపెస్ట్ కేఫేలో చిక్ అండ్ గ్లామరస్ లుక్:**

ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉన్న పూజా హెగ్డే, బుడాపెస్ట్‌లోని ఒక వినూత్నమైన కేఫేలో ఈ సరదా ఫొటోషూట్ చేశారు. గోడల నిండా చేతిరాత నోట్లు, నేలపై ఎండుగడ్డి చల్లి ఉన్న క్రియేటివ్ కేఫేలో ఒక కలప స్టూల్‌పై కూర్చుని ఆమె క్యూట్‌గా ఫోజులిచ్చారు. "పుట్ ద పెస్ట్ ఇన్ బుడాపెస్ట్" అని తన ఫొటోలకు ఇచ్చిన సరదా క్యాప్షన్ నెటిజన్లను భలే ఆకట్టుకుంటోంది.

**యెల్లో అవుట్‌ఫిట్ అట్రాక్షన్:**

ఈ ఫొటోషూట్‌లో పూజా హెగ్డే ధరించిన యెల్లో కలర్ ఫిట్టెడ్ మినీ డ్రెస్ ఆమె అందాన్ని మరింత పెంచింది. డీప్ వి-నెక్‌లైన్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు తోడు ఓవర్ సైజ్డ్ క్రీమ్ షేడ్ సన్ గ్లాసెస్, కలర్‌ఫుల్ ప్యాటర్న్డ్ వేస్ట్ బ్యాగ్ మరియు హైహీల్డ్ మెటాలిక్ ప్లాట్‌ఫార్మ్ శాండల్స్‌ను మ్యాచ్ చేశారు. ఇక తన పక్కనే కలర్‌ఫుల్ బ్యాగ్ ఉంచి, ఒక చేతితో జుట్టును సరిచేసుకుంటూ ఆమె ఇచ్చిన క్యూట్ స్మైల్ నెటిజన్లను ఫిదా చేస్తోంది.

**తొలి అడుగు నుంచి సౌత్, నార్త్ పాన్ ఇండియా రేంజ్:**

'ముగమూడి' అనే తమిళ సూపర్ హీరో చిత్రంతో వెండితెరకు పరిచయమైన పూజా, తెలుగులో 'ఒక లైలా కోసం', 'ముకుంద' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'మొహెంజోదారో'తో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. 'దువ్వాడ జగన్నాథమ్', 'మహర్షి', 'అల వైకుంఠపురములో', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి వరుస హిట్‌లతో టాలీవుడ్‌లో అగ్ర నటిగా నిలిచారు. ఇక విజయ్ సరసన 'బీస్ట్', ప్రభాస్ సరసన 'రాధే శ్యామ్' వంటి భారీ చిత్రాల్లోనూ మెరిసారు.

**చేతినిండా క్రేజీ ప్రాజెక్ట్‌లు:**

ఇటీవలే హిందీ థ్రిల్లర్ 'దేవా', సూర్యతో కలిసి 'రెట్రో', అలాగే 'కూలీ' సినిమాలో ప్రత్యేక పాత్రలో మెరిసిన పూజా హెగ్డే, నటించి అలరించారు. ఇక ఇటీవల వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై', విజయ్ కాంబినేషన్‌లో 'జన నాయగన్', మూవీస్ తో ప్రేక్షకుల ను పలకరించారు. ఇక దుల్కర్ సల్మాన్‌తో 'శ్రీ శ్రీ' అనే తెలుగు రోమాంటిక్ డ్రామా మరియు 'కాంచన 4' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో తన స్టైలిష్ ఫొటోషూట్‌లతో నిత్యం ట్రెండింగ్‌లో ఉండటం పూజా హెగ్డే ప్రత్యేకత. పాన్ ఇండియా స్థాయిలో వరుస సినిమాలతో అలరిస్తూనే, ఇలాంటి గ్లామరస్ లుక్స్‌తో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇస్తున్న ఈ బుట్టబొమ్మ రాబోయే చిత్రాలతో మరింత ఘనవిజయాలు సాధించాలని కోరుకుందాం.



పీచ్ రంగు ఆర్గాంజా చీరలో అద్భుతమైన అందంతో ఆమ్నా షరీఫ్; కాలాతీతమైన సాంప్రదా య హుందాతనాన్ని చాటుతున్న ఈ సుందరమైన చిత్రం.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com